కలం.. నిరసన గళం

కుట్రపూరితంగానే మీడియాపై దాడులు

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సీఎం జగన్మోహన్‌రెడ్డి వైఫల్యాలను ఎండగడుతున్న మీడియాకు సమాధానం చెప్పలేక కుట్ర పూరితంగా వరుస దాడులకు తెగబడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. మొన్న రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి, నిన్న కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి కుట్రలో భాగమేనన్నారు. బుధవారం నెల్లూరులోని తన నివాసం నుంచి ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రోజురోజుకూ శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంగోలులో తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై పట్టపగలు దాడి జరగడం దురదృష్టకరమన్నారు. పట్టపగలే ఇన్ని దాడులు జరుగుతున్నా పోలీసు వ్యవస్థ ఏమైపోయిందని సోమిరెడ్డి ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మీడియాపై జరుగుతున్న వరుస దాడుల విషయంలో గవర్నర్, ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని కోరారు.

జగన్ పైశాచికానికి నిదర్శనం : కోటంరెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

మీడియా ప్రతి నిధులు, కార్యాలయాలపై వైసీపీ గూం డాలు దాడులకు తెగబడటం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పైశాచికానికి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దుయ్యబట్టారు. బుధవారం నెల్లూరు లోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావే శంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గూండాయిజం పెరిగిపోయిందని, ఆఖరుకు మీడియాకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇవాళ ఆంధ్రజ్యోతి, ఈనాడులపై దాడులు జరిగాయని, రేపు ఇంకొకరిపై జరుగుతా యన్నారు. జర్నలిస్టులంతా ఒక్కటిగా ఉండి ఇలాంటి దుర్మార్గాలను ఎదుర్కో వాలని పిలుపునిచ్చారు. నిజాలను నిర్భయంగా రాస్తున్న రాధాకృష్ణ, రామోజీ రావు, బీఆర్ నాయుడులపై లారీ క్లీనర్ కొడాలి నాని వ్యాఖ్యలు ఆయన సిగ్గులేని తనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. మీడియాపై దాడులను సాక్షిలో పని చేస్తున్న వారు కూడా ఖండించాలని, వారు కూడా తాము జర్నలిస్టులమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని కోటంరెడ్డి సూచించారు. ఈ సమావేశంలో మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, పిట్టి సత్యనాగేశ్వరరావు, కువ్వారపు బాలాజీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

- **ప్రశ్నించే గళం వింటే జగన్‌కు భయం : అజీజ్**

ప్రశ్నించే గళం వింటే సీఎం జగన్మోహన్‌రెడ్డికి వణుకు పుడుతోందని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. బుధవారం నెల్లూరులోని తన నివాసం నుంచి ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరాభవం ఖాయమని తెలిసిపోవడంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వైసీపీ మూకతో మీడియా ప్రతినిధులు, సంస్థలపై జగన్‌రెడ్డి దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. నియంతపాలనకు ప్రజాస్వామ్యంలో చోటు లేదని, కాలగర్భంలో కలిసిపోక తప్పదని అజీజ్ స్పష్టం చేశారు.

కొనసాగుతున్న ఆందోళనలు



సైదాపురం : డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



బిట్రగుంట : తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసనలు చేస్తున్న ఎస్.మల్లి తదితరులు

సైదాపురం/అల్లూరు : పాత్రికేయులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జిల్లాలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. సైదాపురంలో జర్నలిస్టుల యూనియన్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ అనురాధకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు రవీంద్రనాథ్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరులోని పాతబస్టాండు కూడలిలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. నాయకులు నరేంద్ర, వేణుగోపాల్, సుధాకర్, మాల్యాద్రి, రాజేష్‌బాబు, కప్పల నవీన్ కుమార్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

- **బిట్రగుంట** : బోగోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట దళిత సంఘర్షణ సమితి నాయకులు ఆందోళన చేశారు. ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలంటూ డిప్యూటీ తహసీల్దారు జూలియాబాయికి వినతిపత్రం అందించారు. ఈ నిరసనలో ఆ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి, దివ్యాంగుల నాయకులు యు.రవి, సాదు ప్రసాద్, ఆత్మకూరి తేజ, ఆనంద్, రత్నం, ఏ.హోహన్‌రావు తదితరులు ఉన్నారు.



అనుకున్నట్లే జరిగింది. ఫ్యాన్‌కు భారీ షాకే తగిలింది. అధికార వైసీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్) తన పదవులకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఫ్యాన్‌లో భారీ కుదుపు తీసుకొచ్చింది. నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న తనకు నష్టం జరిగేలా జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు పావులు కదపడం, ఇందుకు పార్టీ పెద్దలు కూడా సహకరించడంతో వీపీఆర్ కొన్ని రోజులుగా రాజకీయాలకు, పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన పోటీ చేయాలనే ఆలోచనను విరమించుకున్నారని, వైసీపీకి రాజీనామా చేస్తారనే ప్రచారం నడిచింది.

అనుకున్నట్టుగానే బుధవారం చెన్నై నుంచి నెల్లూరులోని తన నివాసానికి చేరుకున్న వీపీఆర్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, జిల్లా అధ్యక్ష పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సంఘటనతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు షాక్‌కు గురయ్యారు.

ఫ్యాన్‌కు షాక్!

- రాజ్యసభ సభ్యత్వానికి, పార్టీకి వీపీఆర్ రాజీనామా
- టీడీపీలో చేరే యోచనలో వేమిరెడ్డి
- ఆయన వెంటే సైకిల్ ఎక్కనున్న నాయకులు
- వైసీపీ నుంచి మొదలు కానున్న వలసలు

నెల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పదికి పది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలిచి తిరుగులేని ఆధిక్యతను చాటుకున్న వైసీపీ కొంత కాలంగా బలహీనపడుతూ వస్తోంది. ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు వైసీపీ అధిష్టానాన్ని ధిక్కరించి తెలుగుదేశం పార్టీలో చేరడంతో వెంకటగిరి, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాల్లో వైసీపీ గ్రాఫ్ పడిపోయింది. ఇప్పుడు ఏకంగా పార్టీ జిల్లా అధ్యక్షుడే రాజీనామా చేయడంతో పార్టీ ప్రతిష్ట మరింతగా పతనం అయ్యింది. ఎమ్మెల్యేల రాజీనామాలు మూడు నియోజకవర్గాల్లో పార్టీని పతనం చేస్తే వీపీఆర్ రాజీనామా జిల్లా వ్యాప్తంగా పార్టీని నైతికంగా దెబ్బతీసింది. వివాద రహితుడిగా గుర్తింపు పొందిన వీపీఆరే పార్టీలో ఇమడలేక బయటకు రావడం జగన్ వ్యవహారశైలిపై ఉన్న విమర్శలకు బలం చేకూర్చింది.

- **వైసీపీ అభ్యర్థుల్లో కలవరం**

వీపీఆర్ వైసీపీకి దూరం కావడం, అంతకంటే ఎక్కువగా టీడీపీకి చేరువ అవుతారన్న ప్రచారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను కలవరపాటుకు గురిచేస్తోంది. వైసీపీ నుంచి వీపీఆర్ పార్లమెంట్‌కు పోటీ చేసి ఉంటే ఎమ్మెల్యే అభ్యర్థులకు చాలా ప్రయోజనాలు ఉండేవి. ముఖ్యంగా ఆర్థిక వనరులతోపాటు అసమ్మతిపోరు ప్రమాదం తప్పి ఉండేది. వాస్తవానికి ఏడాదికి ముందు వీపీఆర్ వైసీపీని వీడుంటే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పెద్దగా నష్టం జరిగుండేది కాదు. ఎందుకంటే ఆయన ఏడాదిన్నర క్రితం వరకు క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలకు దూరంగానే ఉన్నారు. నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేయాలని జగన్ ఆయనపై ఒత్తిడి పెంచడం, ఆ క్రమంలో ఆయన క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌పై దృష్టిపెట్టారు. ఇదే ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను కలవరపాటుకు గురిచేస్తోంది. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో మెజారిటీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలకు వ్యతిరేక వర్గం ఉంది. ఈ అసమ్మతి వర్గాన్ని వీపీఆర్ తన దారిలోకి తెచ్చుకున్నారు. అసమ్మతి సెగలు ఎమ్మెల్యే అభ్యర్థుల మీద పడకుండా సర్దుబాటు చేశారు. ఈయన ఎంపీగా పోటీ చేయడం ద్వారా ఆర్థిక సహాయ సహకారాలతో పాటు అసమ్మతి సెగలను కట్టడి చేయడం వారిలో కొండంత బలాన్ని నింపింది. అయితే ఇప్పుడు వీపీఆర్ పార్టీకి రాజీనామా చేయడం, టీడీపీలో చేరతారన్న ప్రచారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు పిడుగుపాటు చందమయ్యింది.



వీపీఆర్ ఇంటిముందు అభిమానులు కోలాహలం

వీపీఆర్ పార్టీ మారే క్రమంలో వ్యతిరేక వర్గంగా ఉన్న నాయకులు, క్యాడర్ వీపీఆర్ వెంట వలస వెళ్లే ప్రమాదం లేక పోలేదు. ఇప్పటికే చాలా నియోజకవర్గాల నాయకులు ఆ ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. కందుకూరు, ఉదయగిరిల మొదలు నెల్లూరు రూరల్ నియోజకవర్గం వరకు వైసీపీ క్యాడర్ నిలువునా చీలే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వీపీఆర్ విషయంలో జగన్ తీసుకున్న తప్పుడు నిర్ణయం తమ తలకు చుట్టుకుందనే బాధ పలువురు ఎమ్మెల్యే అభ్యర్థుల్లో కనిపిస్తోంది.



వీపీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

- **తెలుగుదేశంలో జోష్..!**

వైసీపీకి కంచుకోటలాంటి నెల్లూరు జిల్లాలో ఆ పార్టీకి చెందిన బలమైన నాయకులు ఒక్కొక్కరుగా అధినేతపై తిరుగుబాటు ప్రకటించి బయటకు రావడంతో తెలుగుదేశం పార్టీలో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. వీపీఆర్ వైసీపీ అభ్యర్థిగా పార్లమెంట్‌కు పోటీ చేయకపోవడం, టీడీపీలో చేరుతారనే ప్రచారాలు 'దేశం'లో జోష్ పెంచాయి.

వామ్మో చడ్డీ గ్యాంగ్!

- ఆర్‌ఎస్‌ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్లో చోరీ
- బీరువాలో రూ.4.6 లక్షల అపహరణ
- సీసీఫుటేజీ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

కావలి రూరల్, ఫిబ్రవరి 21: కావలి పట్టణ సమీపంలోని ముసునూరు టోల్‌గేట్ వద్ద ఉన్న ఆర్‌ఎస్‌ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆర్‌ఎస్‌ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 19వ తేదీ రాత్రి గుర్తుతెలియని ముగ్గురు దుండ గులు ప్రవేశించి ఆఫీస్ రూంలోని బీరువా పగల గొట్టి అందులోని రూ.4.60 లక్షలు అపహరించు కెళ్లా రు. ఈ విషయం గుర్తించిన పాఠశాల ప్రిన్సిపాల్ అమరజ్యోతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ కాటూరి శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని లభించిన సీసీ ఫుటేజ్ ఆధారంగా దుండగుల ధరించిన దుస్తులు, వారి కదలికలను బట్టి చడ్డీ గ్యాంగ్‌గా అనుమాని స్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కళాశాలలు, పాఠశాలలు ఈ ముఠా టార్గెట్ చేస్తుందని, ఇదే తరహాలో తమిళనాడులోని విల్లీపురం డిగ్రీ కళాశాలలో, తిరుపతిలోని కార్ల షోరూంలలో ముగ్గురు వ్యక్తులు వెళ్లి దొంగతనాలకు యత్నించగా సీసీ ఫుటేజ్ పరిశీలించి చడ్డీ గ్యాంగ్‌గా నిర్ధారించారన్నారు. జాతీయ రహదారికి సమీపంలో ఉన్న వారు తప్పని సరిగా తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసు కోవాలన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



జిల్లా ఓటర్లు 19,18,315

- 2317 పోలింగ్ కేంద్రాలు
- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 21 : జిల్లాలో ఇప్పటి వరకు 19,18,315 మం ది ఓటర్లు నమోదైనట్లు కలెక్టర్ హరినారాయ ణన్ తెలిపారు. బుధ వారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 2317 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. పూర్తి స్థాయిలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు. ఫారం-6 కింద 1662 దరఖాస్తులు, ఫామ్-7 కింద 1748 దరఖాస్తులు, ఫామ్-8 కింద 423 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటున్నామని వివరిం చారు. అన్ని రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను పూర్తిస్థాయిలో నియమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, వైసీపీకి చెందిన మురళీధర్‌రెడ్డి, సీ నారాయణ, టీడీపీకి చెందిన వీ హరికృష్ణ, కాంగ్రెస్‌కు చెందిన బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

డీఎస్సీ-2008 అభ్యర్థులకు ఆహ్వానం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 21 : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డీఎస్సీ-2008లో అర్హత సాధించి కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంటీఎస్ కింద పనిచేసేందుకు సుముఖత వ్యక్త పరిచిన అభ్యర్థులను ఉపాధ్యాయ ఖాళీల్లో నియమించేందుకు ఆహ్వాని స్తున్నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో సుముఖత వ్యక్తం చేసిన సీహెచ్ గురవయ్య, సీహెచ్ లక్ష్మీ నరసన్న, ఎంవీ సుభాషిణి, ఎస్ ప్రభాకర్, ఎస్‌కే ఫరీదాభాను, కే జనార్ధన్, ఎం ఇంద్రసేనమ్మ బుధవారం ఉద యం 10.30 గంటలకు వారి అర్హత ధ్రువపత్రాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.



పోలీస్‌స్టేషనులో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు, చిత్రంలో ఎస్ఐ ఖాజావలి

రక్షకుడే లంచావతారం!


- అరెస్ట్ చేయకుండా నగదు డిమాండ్
- నిందితులతో రూ.25వేలకు ఒప్పందం
- మధ్యవర్తి ద్వారా డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ దాడులు
- కొండాపురం ఎస్ఐతోపాటు మహిళ అదుపులోకి..

కొండాపురం, ఫిబ్రవరి 21 : రక్షకుడే లంచావతారం ఎత్తిన సంఘటన ఇది. ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడి వద్ద నుంచి రూ.25 వేలు లంచం తీసుకున్నందుకు కొండాపురం ఎస్ఐ ఖాజావలిని ఏసీబీ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసులు కథనం మేరకు.. కొండాపురం మండలం గరిమెనపెంట పంచాయతీ ఎర్రబొట్లపల్లికి చెందిన కుక్కపల్లి చిన హజరత్తయ్యపై 2023 జూలైలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. అదే సంవత్సరం ఆగస్టులో చిన హజరత్తయ్య భార్య తనను హింసిస్తున్నాడంటూ కేసు పెట్టింది. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ కేసు విషయమై చిన హజరత్తయ్య, అతని స్నేహితుడు అరిగెల శ్రీనివాసులును ఈ నెల 16వ తేదీన ఎస్సై ఖాజావలి స్టేషన్‌కి పిలిపించారు. మిమ్మల్ని అరెస్టు చేయకుండా ఉండేందుకు డీఎస్పీతో మాట్లాడి 41-ఏ నోటీసు ఇస్తానని, అలాగే చిన హజరత్తయ్యపై భార్య పెట్టిన కేసును రాజీ చేసి, కేసు కొట్టేసేలా చేస్తానని పేర్కొన్నారు. ఇందుకుగాను రూ.30వేలు ఇవ్వాలని ఎస్ఐ డిమాండ్ చేసి, చివరకు రూ. 25 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. లంచం ఇచ్చేందుకు ఇష్టంలేని చిన హజరత్తయ్య ఏసీబీని ఆశ్రయించారు. వారు ఇచ్చిన సూచనలతో బుధవారం నిందితులు ఎస్ఐను కలవగా స్థానికంగా ఉన్న ఓ ఫిల్లింగ్ స్టేషన్‌లో నగదు ఇవ్వాలని సూచించారు. వారు అక్కడకువెళ్లి ఫిల్లింగ్ స్టేషన్‌లో పని చేస్తున్న ఓ మహిళకు నగదు ఇచ్చారు. తనకు నగదు అందినట్లు సదరు మహిళ ఎస్ఐకి ఫోన్ ద్వారా తెలియచేసింది. వెంటనే ఏసీబీ అధికారులు దాడులు చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వేసుకున్న కోటుకు కుడి వైపు జేబులో ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. కాగా ఫిల్లింగ్‌స్టేషన్ మేనేజర్ ఖాతా ద్వారా 2023 జూన్ నుంచి ఎస్ఐ ఖాజావలి రూ.లక్షల్లో లావాదేవీలు జరిపినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇంకా మరికొన్ని లావాదేవీలు ఉన్నాయని, వాటిని పరిశీలిస్తున్నామని వారు వివరించారు. ఎస్ఐతోపాటు సహకరించిన మహిళ పార్వతిని అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు కేసునమోదుచేసి నెల్లూరు ఏసీబీ కోర్టులో వారిని హాజరు పరుస్తామని తెలిపారు.

6న కందుకూరులో పొగాకు వేలం ప్రారంభం

- 14 నుంచి కలిగిరి, డీసీపల్లిలో కొనుగోళ్లు

కందుకూరు/మర్రిపాడు, ఫిబ్రవరి 21 : కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాలలో మార్చి 6వ తేదీన కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. గుంటూరులోని పొగాకుబోర్డు కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పొగాకు వేలం కేంద్రాలను ఈ నెల 29 నుంచే ప్రారంభిస్తుండగా, మార్చి 6న కందుకూరులోని రెండు వేలం కేంద్రాలు, మార్చి 14న కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాలలో వేలం ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతులు గ్రేడింగ్‌లు సక్రమంగా చేసుకుని వేలానికి తీసుకుని రావటం ద్వారా గిట్టుబాటు ధరలు పొందాలని ఆయన కోరారు.



అడుగంటుతున్న సోమశిల జలాశయం

- ప్రాజెక్టుల్లో తగ్గుతున్న నీటినిల్వలు
- ఇంకా నెలన్నరపాటు నీరివ్వాల్సిన పరిస్థితి
- కేటాయింపులకు మించి సాగవుతున్న పంటలు
- తాగునీటికి సమస్యలు తలెత్తే ప్రమాదం

జాగ్రత్త పడకుంటే కష్టాలే!

నెల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంటల సాగు కీలక దశకు చేరుకుంది. కొన్నిచోట్ల వచ్చే నెలలో వరి కోతలు జరగనుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఏప్రిల్‌లో కోతలు జరగనున్నాయి. ఈ ఏడాది నీటి లభ్యత తక్కువగా ఉన్న కారణంగా సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు రైతులు తీవ్రంగా నష్టపోయి రెండోసారి నార్లు పోసుకున్నారు. ఈ పరిస్థితుల్లో కనుపూరు కెనాల్ మినహాయించి పెన్నా డెల్టాలో మార్చి 15వ తేదీ వరకు కనుపూరు, కావలి, ఉత్తర, దక్షిణ కాలువ కింద ఏప్రిల్ మొదటి వారం వరకు సాగునీరు విడుదల చేయాల్సి ఉంటుందని వ్యవసాయ, ఇరిగేషన్ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. సాగునీటి సలహా మండలి (ఐఏబీ)లో 2 లక్షల ఎకరాలకు నీటి కేటాయింపులు ఇచ్చేలా నిర్ణయం తీసుకోగా ఆ తర్వాత లెక్కలు మారిపోయాయి. 3లక్షల ఎకరాల వరకు సాగు జరుగుతున్నట్లు అంచనా. దీంతో గతంలోలా కాకుండా ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటికే సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో నీటినిల్వలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. కండలేరు కింద గూడూరు, వెంకటగిరి ప్రాంతాల్లో అనధికారికంగా చెరువుల్లో ఉన్న నీటితో పంటలు వేసేశారు. ఇప్పుడు ఆ పంటలను కాపాడుకునేందుకు నీరు ఇవ్వాలని అధికారులపై రైతులు ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు సోమశిల కింద కావలి, దక్షిణ కాలువల చివరి ఆయకట్టుకు నీరందడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. బుధవారం సోమశిలలో 19.379 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రోజుకు 3500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. ఆవిరి నష్టాలతో కలుపుకొని మూడు రోజులకు ఒక టీఎంసీ ఖర్చవుతోంది. మరో రెండు వారాలు ఇదే మొత్తాన్ని విడుదల చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత డెల్టా ప్రాంతానికి కొంత తగ్గించవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ లెక్కన చూసుకున్నా ఏప్రిల్ మొదటి వారం వరకు మరో పది టీఎంసీలలోపు మాత్రమే ఖర్చు చేయగలిగితేనే భవిష్యత్‌లో ఇబ్బందులు తల్తెతకుండా ఉంటాయి. అప్పుడు 7.50 టీఎంసీలు డెడ్ స్టోరేజీ పోను మరో రెండు టీఎంసీలు తాగునీటి అవసరాలకు సరిపోతాయి. అలా కాకుండా నీటి యాజమాన్యంలో నిర్లక్ష్యం వహిస్తే తాగునీటికి ఇబ్బందులు పడాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాగుకు పోను మిగిలిన నీటితోనే సెప్టెంబరు, అక్టోబరు వరకు జిల్లా తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంటుంది.



కండలేరు డ్యాం

- **చెన్నైకు అవసరం లేదు!**

ఈ ఏడాది చెన్నై తాగునీటి అవసరాలకు ఇంత వరకు సోమశిల నుంచి నీటి విడుదల చేయలేదు. అదృష్టవశాత్తూ మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో చెన్నైలోని రిజర్వాయర్లన్నీ నిండిపోయాయి. వారికి ఇప్పట్లో నీటి అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు. కాబట్టి ఆ మిగులు నీరే ఇప్పుడు పంటలను కాపాడుతోందని అంటున్నారు. అదే సమయంలో కండలేరులో 10.70 టీఎంసీల నీరు ఉంది. డెడ్ స్టోరేజీ 8.40 టీఎంసీలు పోను నికరంగా 2.30 టీఎంసీలు మాత్రమే సాగు, తాగుకు నీరు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున దిగువకు విడుదల చేస్తున్నారు. కానీ గూడూరు, వెంకటగిరి ప్రాంతాల్లో పంటలను కాపాడేందుకు నీరు విడుదల చేయాలంటూ రైతుల నుంచి విన్నపాలు అందుతుండటంతో కచ్చితంగా నీటిని ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అప్పుడు గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి ప్రాంతాలకు తాగునీటిని డెడ్‌స్టోరేజీ నుంచి తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని భావిస్తున్నారు. ప్రతి బొట్టును జాగ్రత్తగా వినియోగించుకుంటేనే వర్షాకాలం వరకు ఇబ్బందులు లేకుండా నెట్టుకురాగలుగుతామని నిపుణులు సూచిస్తున్నారు. ఇక నుంచి ఉన్నతాధికారులు నిరంతరం నీటి యాజమాన్యాన్ని పర్యవేక్షించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో రెండో స్థానం

- 74 శాతం లబ్ధిదారులకు అందజేత
- ప్యాకేజి పెంపుపై నెట్‌వర్క్ ఆసుపత్రుల అనాసక్తి
- ఆయుష్మాన్ భారత్ కార్డుల లక్ష్యం 9.05 లక్షలు
- ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 21 : కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో జిల్లా రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా 7.16 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉండగా, ప్రభుత్వ అధికారులు వారందరికీ డిజిటల్ కార్డులు అందించాలని నిర్ణయించారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు అందించేందుకు ఉన్న మొత్తాన్ని రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు ప్రభుత్వం పెంచింది. ఇందుకుగాను కొత్త ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు రూపుదిద్దుకున్నాయి. జిల్లాలోని గ్రామ/ వార్డు సచివాలయాల ద్వారా 6.08,214 కార్డులు పంపిణీ చేశారు. 74 శాతం కార్డులు లబ్ధిదారు లకు అందచేసినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన కార్డులు కూడా త్వరలో రానున్నట్లు తెలిపారు. గత నెల రోజులుగా ఈ కార్డుల పంపిణీ చేస్తున్నారు. కాగా జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో రూ. 25 లక్షల పరిమితిని ఏ ఆసు పత్రి కూడా అంగీకరించటంలేదని తెలుస్తోంది. ఇప్పటికే బకాయిలు రూ.కోట్లలో ఉన్న నేపథ్యంలో ఇంత మొత్తంలో వైద్యసేవలను అందించేందుకు ఎవరూ ముందుకు రాలేదు.



కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు

● 9.05 లక్షల కార్డులు లక్ష్యం

అలాగే కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ కూడా జిల్లాలో జరుగుతోంది. 2011 జనాభా ప్రాతిపదికన 9,05,118 కార్డులు పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది.ఇందులో ఇప్పటికే 7,98,788 కార్డులు పంపిణీ చేశారు. 88.25 శాతం పంపిణీ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ కార్డులపై ఉచిత వైద్యచికిత్సలు అందించేందుకు నెట్‌వర్క్ ఆసుపత్రులు అంగీకరించడం లేదు. ఆరోగ్యకార్డులు లేని వారికి మాత్రమే వైద్యసేవలు అందిస్తామంటూ కొన్ని ఆసుపత్రులు స్పష్టం చేస్తున్నాయి. అయితే బయట రాష్ట్రాల్లో ఆయుష్మాన్‌భారత్ కార్డులు ఉపయోగపడతాయని అధికారులు పేర్కొన్నారు.



త్వరలో అన్ని కార్డుల పంపిణీ

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భారత్ కార్డులు త్వరలో అందరికీ పంపిణీ చేస్తాం. రాష్ట్రంలోనే కార్డుల పంపిణీలో రెండో స్థానంలో ఉన్నాం. ఆరోగ్యశ్రీ కార్డులకు నిర్దేశించిన రూ. 25 లక్షల ఖర్చు పరిమితిని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ చంద్రశేఖర్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్

తాగునీటి విక్రయాల జోరు

- వేసవిలో వ్యాపారం రూ.40 కోట్లు
- పుట్టగొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు
- ఏర్పాటులో నిబంధనలకు నీళ్లు
- తనిఖీలు మరిచిన అధికారులు
- ప్రతి ఏటా ఇక్కట్లే...
- పాఠం నేర్వని అధికార యంత్రాంగం

ఆత్మకూరు, ఫిబ్రవరి 21: జిల్లాలో వేసవి ప్రారంభంలోనే తాగునీటి వ్యాపారం జోరందుకుంది. ప్రస్తుతం ఈ వ్యాపారానికి డిమాండ్ పెరగడంతో భూగర్భంలో నుంచి ఇష్టానుసారంగా 5 హెచ్‌పీ మోటార్లతో నీటిని తోడేస్తున్నారు. ఏటా జిల్లాలో ఏటా రూ.40 కోట్లకు పైగా తాగునీటి వ్యాపారం సాగుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. లీటరు మినరల్ వాటర్ కోసం ప్రస్తుతం రూ.10లు ఖర్చుచేస్తుంటే, రాబోయే పదేళ్లలో లీటర్ నీటికి రూ.50లకు పైగా ఖర్చు చేయాల్సి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. పేదలు స్వచ్ఛమైన నీరు కావాలంటే ఆదాయంలో సగం వెచ్చించాల్సి వస్తుందని యూఎన్ నివేదిక వెల్లడించింది. పట్టణాలతోపాటు మారుమూల గ్రామాల్లో సైతం ప్రతిరోజూ ప్రజలు వాటర్ క్యాన్‌ను రూ.10 పెట్టి కొనుగోలు చేసుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు. కాగా ప్రతిఏటా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తుతున్నా అధికారులు మాత్రం పాఠాలు నేర్చుకోవడం లేదు.

● పుట్టగొడుగుల్లా ప్లాంట్లు

ఇటీవల ప్రతిఒక్కరికి తాగునీటిపై అవగాహన పెరగడంతో ఆర్వో ప్లాంట్‌ల ద్వారా శుద్ధిచేసిన నీటికి ప్రాధాన్యత పెరిగింది. దీంతో పుట్టగొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు పుట్టుకొచ్చాయి. మినరల్ వాటర్ పేరుతో ఎలాంటి నిబంధనలు పాటించకుండా కొందరు వాటర్‌ప్లాంట్ యజ మానులు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. వేసవి రావడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ఆత్మకూరుతోపాటు మండలంలోని గ్రామాల్లో సైతం 70 శాతానికిపైగా ప్రజలు మినరల్ వాటర్‌కు అలవాటుపడ్డారు. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు శుద్ధిచేయని నీటిని ప్రజలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని ఆర్వో ప్లాంట్లను అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

నిబంధనలు ఇలా...

- ప్రతి ఆర్వో ప్లాంటు ఐఎస్ఐ మార్కు కలిగి ఉండాలి. ప్రతి ప్లాంటులోనూ మైక్రో బయాలజీ ల్యాబ్ ఉండాలి.
- ల్యాబ్‌లో క్వాలిఫైడ్ టెక్నీషియన్ ఉండాలి. శుద్ధిచేసిన నీరు 7.5 గాఢత కలిగి ఉండాలి. నీటిని శుద్ధి చేసిన అనంతరం వ్యర్థజలాలను కాలువలు, చెరువుల్లోకి వదిలివేయరాదు.
- ప్లాంట్ల చుట్టూ పరిశుభ్రమైన వాతావరణం ఉండాలి. ప్రతి వాటర్ క్యాన్‌పై ఐఎఎస్ ముద్ర ఉండాలి. దీంతో పాటు ఆ నీటిని ఎన్ని రోజుల వరకు వినియోగించుకోవచ్చుననే వివరాలు కూడా ఉండాలి.
- ప్రతి ఆరునెలలకు ఒకసారి ఆహార తనిఖీ అధికారులు ప్లాంట్‌ను పరిశీలించి ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. కానీ పలు ఆర్వో ప్లాంట్లలో ఎక్కడా ఈ నిబంధనలు కానరావడంలేదు.


గ్రామాల్లో వాహనాల వద్ద నీటి కొనుగోళ్లు(ఫైల్)

● అధికారుల తనిఖీలేవి ?

ఆర్వో ప్లాంట్లను తనిఖీలు చేయాల్సిన బాధ్యత ఫుడ్ ఇన్‌స్పెక్టర్లది. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఆ పోస్టు లేకపోవడంతో ఆర్వో ప్లాంట్ల యజమానులు ఆడిందే ఆట..పాడిందే పాటగా ఉంది. ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాల్సిన అధికారులు ఇప్పటికైనా ఆర్వో ప్లాంట్లపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

● అధికారికంగా 150 ప్లాంట్లు

ఆత్మకూరు నియోజకవర్గంలో 150కి పైబడి ప్రభుత్వ, ప్రైవేటు వాటర్‌ప్లాంట్లు ఉన్నాయి. ఆత్మకూరు మండలంలో 8 ప్రభుత్వ వాటర్‌ప్లాంట్లు, మరో 15 ప్రైవేటువి ఉన్నాయి. అనంతసాగరంలో 15 ప్రభుత్వ, 3 ప్రైవేట్, మర్రిపాడులో 15 ప్రభుత్వ, 6 ప్రైవేట్, చేజర్లలో 6 ప్రభుత్వ, 18 ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లు ఉన్నట్లు అధికారికంగా లెక్కలు ఉన్నాయి. కాగా నియోజకవర్గంలో అనధికారికంగా మరో 70 ప్లాంట్లు నీటి వ్యాపారం చేస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 528 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 21 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ 1వ సెమిస్టర్ పరీక్షలకు 528 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు యూనివర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 7798 మంది విద్యార్థులకు గాను 7270 మంది హాజరయ్యారు.

మేకపాటి గౌతంరెడ్డికి ఘన నివాళి


'స్మృతివనం' భూమిపూజలో పాల్గొన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఉదయగిరి, ఫిబ్రవరి 21: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభు త్వ వ్యవసాయ కళాశాలలో బుధ వారం మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి రెండో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్మృతి వనం ఏర్పాటుకు కుటుంబ సభ్యులు వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య భూమిపూజ చేశారు. అనం తరం ఆయన చిత్రపటానికి తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, తల్లి మణిమంజరి, భార్య శ్రీకీర్తి, తమ్ముడు విక్రమ్‌రెడ్డి, పృథ్వీరెడ్డి, చిన్నాన్న రాజగోపాల్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు చెందిన ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం మహిళలకు వస్త్రదానం చేశారు.

● గౌతమ్ సేవలు మరువలేనివి : కాకాణి

దివంగత మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి సేవలు మరువలేనివని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మంత్రిగా గౌతంరెడ్డి రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచేలా సంగం బ్యారేజీకి ఆయన పేరు పెట్టామన్నారు. ఉదయగిరిలో గౌతంరెడ్డి పేరున వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం గౌతంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్టంగా ఏర్పాట్లు : కలెక్టర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 21 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం హరినారయణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆత్మకూరు సమీపంలోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో గదులను పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న గదులను ఈవీఎంల భద్రత, స్ట్రాంగ్ రూముల కోసం ఎంపిక చేయాలన్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయం కోసం, మున్సిపాలిటీ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ, స్క్రూటీని, అభ్యర్థులు వేచి ఉండే గదులను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, శిథిలావస్థలో ఉన్న భవనం నుంచి కార్యాలయాన్ని మరో భవనంలోకి మార్చాలని తహసీల్దార్ శివనాగిరెడ్డికి సూచించారు. ఆయన వెంట రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కే మధులత, మున్సిపల్ కమిషనర్ వజులుల్లా, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. కాగా కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలను కూడా కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా కళాశాల పరిసరాలను, గదులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయట వెంట రెవెన్యూ అధికారులు ఉన్నారు.

రామతీర్థంలో ఆగిన కోడిపందేలు

- సకాలంలో స్పందించిన పోలీసులు
- హర్షం వ్యక్తం చేసిన భక్తులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విడవలూరు, ఫిబ్రవరి 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం గ్రామంలో వైసీపీ నాయకులు తలపెట్టిన కోడిపందేలు బుధవారం నిలిచిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన రామతీర్థంలో కోడిపందేలు కథనం జిల్లాలో కలకలం రేపింది. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి కోడిపందేల నిర్వహణపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో పోలీసులు హుటా హుటిన రామతీర్థం గ్రామానికి చేరుకుని వాహనాలపై నిఘా ఉంచారు. దీంతో కోడిపందేల నిర్వాహకులు పందేలు నిర్వహించలేదని సమాచారం. కాగా, సకాలంలో స్పందించిన పోలీసుల పనితీరు పట్ల రామలింగేశ్వర స్వామి భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాదం


వివాదానికి దిగిన క్రయ విక్రయదారులు

ఉదయగిరి, ఫిబ్రవరి 21: ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం క్రయవిక్రయదారులు సిబ్బందితో వివాదానికి దిగారు. బాధితుల కథనం మేరకు, వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లి మజారా కొండ్రాజుపల్లికి చెందిన గుంటూరు విజయమ్మ వారసత్వంగా సంక్రమించిన వివిధ సర్వేనెంబర్లలోని 1.72 ఎకరాలను అదే గ్రామానికి చెందిన బొమ్మినేని రమేష్‌కు విక్రయించేందుకు ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం డాక్యుమెంటేషన్ అందజేశారు. అయితే మూడు రోజులుగా సిబ్బంది రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని, దీంతో ఆందోళనకు దిగారు. ఈ విషయమై సబ్‌రిజిస్ట్రార్ విజయరాణిని వివరణ కోరగా వరికుంటపాడు మండలంలోని అనేక భూములు వివాదాస్పదంగా ఉన్నాయని, రికార్డులు పరిశీలించి రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. రికార్డులు పరిశీలించ డం ఆలస్యం కావడంతో క్రయవిక్రయదారులు ఆందోళనకు దిగారని తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సర్దుబాటు చేశారని తెలిపారు. సిబ్బంది రికార్డులు పరిశీలించగా అందులో సుమారు 40 సెంట్ల మేర వివాదంలో ఉందని, మిగిలిన భూమిని రిజిస్ట్రేషన్ చేశామని ఆమె చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవరు మృతి


అబ్దుల్ రజాక్ మృతదేహం

ఆత్మకూరు, ఫిబ్రవరి 21 : మండలంలోని నారంపేట సమీపంలో నెల్లూరు, ముంబాయి జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని బోయిళ్ల చిరువెళ్లకి చెందిన అబ్దుల్‌రజాక్(53) ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన డ్యూటీలో చేరేందుకు బుధవారం స్వగ్రామం నుంచి మోటారుబైక్‌పై బయలుదేరి ఆత్మకూరుకు వస్తున్నాడు. ఆ సమయంలో నెల్లూరు నుంచి కడప వైపు వెళ్లే లారీ నారంపేట వద్ద ఢీ కొంది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆత్మకూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రజాక్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 21: నెల్లూరులోని మినీబైపాస్ దగ్గర జీవీఆర్‌ఆర్ కళాశాల సమీపంలో రోడ్డుదాటుతుండగా ఐషర్ వాహనం ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని పత్తేఖాన్‌పేటకు చెందిన బీ వెంకటేష్(20) అదే ప్రాంతంలోని రైతుబజారు సమీపంలో పూలదుకాణంలో పనిచేస్తున్నాడు. వెంకటేష్‌కు పడూరుపల్లి సుందరయ్యకాలనీకి చెందిన ఫ్లవర్ డెకరేటర్ గోవర్ధన్, కనుపర్తిపాడుకు చెందిన ప్లంబర్ సునీల్ స్నేహితులు. బుధవారం తెల్లవారుజాము వరకు ముగ్గురూ కలిసి పూలదుకాణంలో తమ స్నేహితుని వివాహం కోసం పూలమాలలు అల్లారు. పనిపూర్తయిన తర్వాత వెంకటేష్ తన స్కూటీపై స్నేహితులను ఇళ్లవద్ద వదిలిపెట్టేందుకు బయలుదేరాడు. స్నేహితులు ముగ్గురు మినీబైపాస్ మీదుగా వెళుతూ జీవీఆర్‌ఆర్ కళాశాల సమీపాన రోడ్డు దాటే క్రమంలో అయ్యప్పగుడి వైపు నుంచి ఆత్మకూరు బస్టాండు వైపు వేగంగా వెళుతున్న ఐషర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై నుంచి కిందపడిన వెంకటేష్ తల పగిలి అక్కడికక్కడే మృతిచెందగా గోవర్ధన్, సునీల్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఎస్ఐ రాజేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడులు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 21: నగరంలోని జ్యోతి నగర్‌లో ఓ పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. జ్యోతినగర్‌లోని ఓ గృహంలో పేకాట జరుగుతోందని నగర డీఎస్పీ డి శ్రీనివాసులురెడ్డి, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణకు సమాచారం అందింది. దీంతో డీఎస్పీ ఐడీ పార్టీ సిబ్బంది మణి, సాగర్, వేదాయపాళెం పోలీసులు బుధవారం దాడి చేశారు. పేకాటాడుతున్న ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.63 వేల నగదును, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 21: వైద్య కళాశాలకు శిక్షణ కోసం వెళ్లిన నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై సంతపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.... తిరుపతి జిల్లా వాకాడుకు చెందిన యువతి నెల్లూరు తల్పగిరి కాలనీలోని నర్సింగ్ స్కూల్‌లో జీఎన్ఎం చదువుతోంది. ఈ నెల 20వ తేదీన ఆమె శిక్షణ కోసం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లింది. ఆ తర్వాత కన్పించలేదు. నర్సింగ్ స్కూల్ యాజమాన్యం యువతి తల్లి మస్తానమ్మకు సమాచారం అందించారు. ఆమె నెల్లూరుకు చేరుకుని కుమార్తె కోసం గాలించారు. జాడ తెలియక పోవడంతో బుధవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దర్జాగా కబ్జా!

- ఉదయగిరిలో యథేచ్ఛగా భూముల ఆక్రమణ


కబ్జాదారులు చదును చేసిన ప్రభుత్వ భూమి

ఉదయగిరి, ఫిబ్రవరి 21 : అధికారుల నియం త్రణ లేకపోవడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కబ్జాలకు తెగబడు తున్నారు. యథేచ్ఛగా ఆక్రమించి చదును చేసి పం టల సాగుకు పూనుకుంటున్నారు. తాజాగా ఉదయ గిరి మండలం సున్నంవారిచింతల రెవెన్యూ పరిధి లోని కొండాయపాళెం పంచాయతీ గానుగపెంటపల్లి సమీపంలో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు రెండు రోజులుగా పూనుకున్నారు. విషయం తెలుసుకున్న మాసాయిపేట ఎస్సీ కాలనీ వాసులు ఇటీవల పనులను అడ్డగించారు. కాలనీ వాసుల కథనం మేరకు.. సర్వే నెం.152లో 190 ఎకరాల పశువుల మేత పోరంబోకు భూమిగా రెవెన్యూ రికార్డులో నమోదై ఉంది. అయితే అదే పంచాయతీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మేతపోరంబోకు భూమి మూడెకరాలను యంత్రాలతో చదును చేసి ఆక్రమించేందుకు పనులు చేపట్టారు. తాతాముత్తాతల నాటి నుంచి పశువుల మేతపోరంబోకు భూములుగా చలామణి అవుతున్న భూములను అధికార పార్టీ నాయకుల అండదండలతో ఆక్రమించడం ఇదెక్కడి న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. లక్షలాది రూపాయలు విలువ చేసే భూములు సాగు చేసేందు కు కబ్జాదారులు పూనుకోవడం, అధికార పార్టీ నాయకుల అండ దండలు ఉండడంతో అధికారులు ఏం చేయాలో తెలియక నిస్స హాయస్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పం దించి భూ ఆక్రమణలపై దృష్టిసారించి నిరుపేదలైన ఎస్సీ కాలనీ వాసులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

బెల్టు దుకాణాలపై సెబ్ పోలీసుల దాడి

- 92 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, ఫిబ్రవరి 21: మండలం ముసునూరు, ఆనెమడుగులో నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలపై బుధవారం సెబ్ పోలీసులు దాడులు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 92 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. సెబ్ సీఐ టీ.లక్ష్మణస్వామి తన సిబ్బందితో కలసి ముసునూరులో దాడులు చేసి బెల్టు దుకాణం నిర్వాహకుడు దుద్దుకుల మౌలాలిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 48 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆనెమడుగులో బెల్టు దుకాణం నిర్వాహకుడు ముక్కు సురేష్‌ను అదుపులోకి తీసుకుని అతని నుంచి 44 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మైపాటి వెంకట రమణయ్య (ఫైల్)

అల్లూరు, ఫిబ్రవరి 21 : విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన మం డలంలోని ఇస్కపల్లి పంచాయతీ జవ్వాగులో బుధవారం సాయంత్రం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మైపాటి వెంకట రమణయ్య (34) ఉప్పుకొఠారులో పని చేస్తుంటారు. ఈ క్రమంలో మోటారు మరమ్మతులకు గురి కావడంతో దానిని పరిశీలించిన అనంతరం ఆయన వెంట ఉన్న మరో వ్యక్తిని స్విచ్ వేయమని చెప్పడంతో దూరంగా ఉన్న స్విచ్ దగ్గరకు వెళ్లి స్విచ్ వేశాడు. అప్పటికే వెంకట రమణయ్య చేతిలో విద్యుత్ వైర్లు ఉండడంతో విద్యుత్ సరఫరా అయ్యి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘట నా స్థలికి వెళ్లి చూడగా విగత జీవుడై పడి ఉన్నాడు. విషయాన్ని పోలీసులకు సమాచారం తెలపడంతో ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	152
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	266
స్కిన్‌లెస్	294
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5929
వెండి కిలో ధర	రూ. 72,700
వెండి ఒక గ్రాము	రూ. 74.70

జీతాల్లేవు.. జీవించేదెలా ?

- అబ్కాస్ ఉద్యోగుల ఆందోళన
- వైద్య కళాశాల, జీజీహెచ్‌లో విధులు


రోగికి వైద్యసేవలు అందిస్తున్న ఉద్యోగులు (ఫైల్)

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 21 : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వైద్య కళాశాలలో ఏడాదిగా పని చేస్తున్నా వీరికి వేతనాలు మాత్రం అందలేదు. జీతాలివ్వండి మహాప్రభో అని అధికారులను వేడుకుంటున్నా వారి వేదన అరణ్య రోదనే అవుతోంది. వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణకు నానా అవస్థలు పడుతున్నారు. ఇదీ అబ్కాస్ ఉద్యోగుల దీనస్థితి. జీజీహెచ్, వైద్య కళాశాలలో గతేడాది ఫిబ్రవరిలో ఓటీ అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, జనరల్ డ్యూటీ అటెండర్లు, ప్లంబర్, మార్చురీ అటెండర్లు కింద అబ్కాస్ ద్వారా ఉద్యోగుల నియామకం చేపట్టారు. ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున వేతనాలు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 17 మంది విధుల్లో చేరారు. అయితే 11 నెలలు పూర్తయినా వీరికి ఇప్పటికీ వేతన బకాయిలు మాత్రం చెల్లించలేదు. బకాయిలు రూ.28 లక్షల వరకు చెల్లించాల్సి ఉన్నా అడుగడుగున ఆటంకాలే ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో దశల వారి పోరాటాలకు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు.

● మంత్రి కాకాణి వద్దే ఫైల్..

అబ్కాస్ ఉద్యోగులు రెండు నెలల క్రితం వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిశారు. తమకు జీతాలు చెల్లించాలని వేడుకున్నారు. కానీ ఇంతవరకు మంత్రి కాకాణి ఆ ఫైల్‌పై సంతకం చేయలేదు. అబ్కాస్ ఉద్యోగుల నియామకాలు పారదర్శకంగా జరగలేదని మంత్రి చెబుతున్నారని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు అంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబును కనుక్కుని ఫైల్‌పై సంతకం పెడుతానని మంత్రి చెబుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియామకాలు పారదర్శకంగా జరగకపోతే విచారణ జరిపి వాస్తవాలు తెలుసుకుని వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు కోరుతున్నారు. అటు విచారణా జరపక, ఇటు జీతాలు చెల్లించక చిరుద్యోగులతో ఆడుకుంటున్నారని వైద్యశాఖ వర్గాలు ఆరోపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల కోడ్ వస్తే ఇప్పట్లో వేతనాలు వచ్చే అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద మనసుతో తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పీహెచ్‌సీలో ప్రసవ వేదన!

- అందుబాటులో ఉండని వైద్యులు, సిబ్బంది
- కందుకూరుకు పరుగులు తీస్తున్న గర్భిణులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలందిండంతోపాటు మాతా శిశు మరణాలను గణనీయంగా తగ్గించాలని, సాధారణ ప్రసవాలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే చేయాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్ధేశించింది. కానీ వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను పక్కన పెడితే కనీస స్థాయిలో కూడా కాన్పులు చేయడంలేదు. పీహెచ్‌సీలో సగటున ఒక కాన్పు కూడా జరగడం లేదు. ప్రైవేట్ ఆసుపత్రులలో కాన్పులు చేయించుకున్న గర్భిణులను గుర్తించి పీహెచ్‌సీలో కాన్పులు చేసినట్లు అధికారులకు నివేదికలు సమర్పిస్తునట్లు సమాచారం. కాన్పుల కోసం గర్భిణులను పీహెచ్‌సీకి తీసుకెళ్లినప్పుడు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వేళ ఆ సమయంలో వైద్యులు, సిబ్బంది ఉన్నప్పటికీ కాన్పు కోసం వస్తున్న గర్భిణులు బలహీనంగా ఉన్నారనో, మరేదైనా సాకు చెప్పి కందుకూరు ఏరియా ఆసుపత్రికి సిఫార్సు చేస్తునట్లు తెలుస్తోంది. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో మరికొంతమంది గర్భిణులు ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసి కాన్పులు చేయించుకుంటున్నారు. సాధారణ కాన్పు అయ్యే సూచనలు ఉన్నప్పటికీ ప్రయివేట్ వైద్యులు డబ్బుల కోసం సిజేరియన్‌లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాల ప్రకారం ప్రతి పీహెచ్‌సీలో సగటున రోజుకొకటి చొప్పున నెలకు కనీసం 30 కాన్పులు చేయాల్సి ఉంది. అయితే నెలకు కనీసం ఒక ట్రెండు కాన్పులు కూడా పీహెచ్‌సీలో చేయడం లేదు. ఈ పీహెచ్‌సీలో భవన వసతితో పాటు అన్ని సదుపాయాలు ఉన్నాయి. ముగ్గురు వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, తగినంతమంది సిబ్బంది, పరికరాలు, మందులు, ల్యాబ్ ఉన్నప్పటికీ గర్భిణులకు ప్రసవాలు చేసే దిక్కేలేదు. అయినప్పటికీ సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు

ఆత్మకూరు, ఫిబ్రవరి 21: త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై ఆత్మకూరు డివిజన్ పరిధిలోని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. పరీక్షల నిర్వహణకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కావలి ఉపవిద్యాశాఖాధికారి రఘురామయ్య, ఎంఈవోలు పాల్గొన్నారు.

మంచి మార్కులు సాధించాలి

ఉదయగిరి: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఎంఈవో భిక్షాలు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ షేక్ షకీరాబేగం తదితరులు పాల్గొన్నారు.

మేకపాటి గౌతంరెడ్డికి ఘన నివాళి

ఆత్మకూరు, ఫిబ్రవరి 21: దివంగత రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ద్వితీయ వర్ధంతిని బుధవారం పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, జేఏసీ కన్వీనర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైసీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, పాల్గొన్నారు.

సంగం : మాజీ దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి రెండో వర్ధంతిని బుధవారం వైసీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగం బ్యారేజి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గౌతమ్‌రెడ్డి అమర రహే అంటూ నినాదాలు చేశారు.





ఆత్మకూరు, సంగంలో గౌతంరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

వైద్యశిబిరం పరిశీలన



నూతక్కివారికండ్రికలో జ్వర పీడితులను పరామర్శిస్తున్న జిల్లా వైద్యాధికారి పెంచలయ్య

చేజర్ల, ఫిబ్రవరి21: మండలంలోని నూతక్కివారికండ్రిక గ్రామంలో జ్వరాల బారిన పడిన వారికి కోసం మూడు రోజుల కిందట వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి పెంచలయ్య పరిశీలించారు. అనంతరం గ్రామంలో జ్వరాలు, నెప్పులతో బాధపడుతున్న వారిని పరామర్శించి వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అదే విధంగా గ్రామంలో పర్యటించి నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మండల వైద్యులు నవీన్, జ్యోతి, సిబ్బంది ఉన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి



సచివాలయంలో రిజిష్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ ఆజాద్

సీతారామపురం, ఫిబ్రవరి 21: సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ అన్నారు. బుధవారం సీతారామపురం బిట్-2 సచివాలయాలన్ని తనిఖీ చేసి మాట్లాడారు. సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. అలాగే సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, ప్రతిరోజూ మూడుగంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనంతరం పలు రిజిష్టర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ బాలినేని ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు.

వైసీపీ నేతపై కేసు నమోదు చేయాలి



ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 21: కడప జిల్లా పులివెందుల వైసీపీ నేత నర్రా రవీంద్రా రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్య క్షుడు స్వర్ణ కొండయ్య, మండల కన్వీనర్ బయ్యన్నలు బుధవారం ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డికి ఫిర్యా దు చేశారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజుపై రవీంద్రారెడ్డి సోషల్ మీడియా వేదికగా అసభ్య పదజాలంతో వ్యక్తిత్వానికి భంగం కలిగేలా తప్పుడు పోస్టులను పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ ఇలాగే పోస్టులు పెట్టారని తెలిపారు. కేవలం దళితుడనే చులకన భావంతో ఈ నీచానికి పాల్పడడం దారుణమన్నారు. కార్యక్రమంలో బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, జాషువా పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 21: మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చేజర్ల జయం త్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం పలు శాఖల అధికారులు వారి యొక్క ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో నందిపాడు, కమ్మవారిపాళెం సొసైటీ అధ్యక్షులు మండ్ల శ్రీనివాసులు, తుమ్మల వెంగయ్య, ఎంపీడీవో సాయిప్రసాద్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సామాజిక భద్రత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్టేట్‌బ్యాంక్ మేనేజర్ కె.నరేష్‌బాబు తెలిపారు. మండలంలోని చుండి, పోలినేనిచెరువు గ్రామాలలో బుధవారం రాత్రి వలేటివారిపాలెం స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ప్రదర్శన జరిగింది. జీరోఖాతాలు, బంగారు రుణాలు తదితర పథకాలపై కళాజాత బృందం సభ్యులు పాటలు, మ్యూజిక్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నరేష్‌బాబు, డిప్యూటీ మేనేజర్ పి. సుబ్బారావు, ఎఫ్‌ఓఎస్ కొండయ్య, కళాజాత బృందం సభ్యులు వినోద్, చిరంజీవి, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.



మేనేజర్ నరేష్‌ను అభినందిస్తున్న ఖాతాదారులు

వైసీపీ రాక్షస పాలనకు నిదర్శనమిదే..!

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన సాగిస్తుందని.. విలేకరులు, పత్రికా కార్యాలయాలపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి మరువకముందే, కర్నూల్‌లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అనుచరులు ఈనాడు కార్యాలయంపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి తీరనిమచ్చన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టి పత్రికా స్వేచ్ఛను కాపాడి, దాడులకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రేపు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 21: స్థానిక ఆల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు అధ్యక్షతన టీడీపీ నియోజకవర్గస్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, నియోజకవర్గ పరిశీలకులు వికాస్‌హరికృష్ణ పాల్గొంటారన్నారు. కావున నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 21: పట్టణంలోని యూనియన్‌రోడ్డుకు చెందిన ముచ్చుల సుబ్బరాయుడు బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. నియోజకవర్గ టీడీపీ నాయకుడు కాకర్ల సురేష్ తన ప్రతినిధులతో అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాబాషా, పులి సందానీ, సురేష్, ఉప్పుటూరి పెదవెంకటయ్య, ట్రస్టు ప్రతినిధి జల్సాయాదవ్ పాల్గొన్నారు.

అనంతసాగరం ఎస్ఐకి సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

అనంతసాగరం, ఫిబ్రవరి 21: ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్ఐ ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డిని బుధవారం టీడీపీ నేతలు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సమస్యలు వివరించి.. వచ్చే ఎన్నికల్లో శాంతిభద్రతకు చర్యలు చేపట్టాని కోరారు. కార్యక్రమంలో పాతపాటి మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

ఉప్పుటేరు నుంచి ఇసుక అక్రమ రవాణా

- బోర్లకు అందని నీరు

లింగసముద్రం, ఫిబ్రవరి 21 : మండలంలోని పెదపవని గ్రామ సమీపంలో ఉన్న ఉప్పుటేరు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతోంది. ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచి ఉదయం 7 గంటల వరకు, అర్ధరాత్రి సమయాల్లో ఇసుకాసురులు ఇష్టానుసారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇసుక యథేచ్ఛగా తోడేస్తున్నందున ఉప్పుటేరులోని బోర్లలో నీరు అడుగంటే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక రవాణా వలన తమ బోర్లకు నీరు అందే పరిస్థితి లేదంటున్నారు. దీంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారు అనుమతులు ఉన్నాయని చెబుతున్నారని, కానీ ఈ నెల 14వ తేదీతో గడువు ముగిసిందని అధికారులు చెప్పారని గ్రామస్థులు చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం





శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, గజవాహనంపై శ్రీవారు

కావలిటౌన్, ఫిబ్రవరి 21: ముసునూరు మందాటి చెరువు అనుకుని ట్రంకురోడ్డు వద్ద వెలసివున్న లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవం భక్తులను కనువిందు చేసింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆటోనగర్ వాస్తవ్యులచే పెద్దఎత్తున అన్నసంతర్పణ గావించారు. సాయంత్రం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు గజ వాహనంపై పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

ఎస్సీ కాలనీలో పలువురు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన ఎస్సీ కాలనీవాసులతో ఇంటూరి

ఉలవపాడు, ఫిబ్రవరి 21 : మండలంలోని భీమవరం ఎస్సీ కాలనీలో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు బుధవారం రాత్రి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ కందుకూరు ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరిన 30 కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతు నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటు రాష్ట్రంలో దళితులకు తీరని నష్టం చేసి వారిని ఆర్థికంగా అణగదొక్కిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, నాయకులు జాజుల రవి, జనసేన నాయకుడు లక్ష్మణ్, చలపతి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో..

కందుకూరు : పడమర వడ్డిపాలెం, ఏరియా వైద్యశాల ప్రాంతాలలో బుధవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిం చారు. టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పాకల మాల్యాద్రి, కంచర్ల సుబ్బారావు, తన్నీరు సుధాకర్, తిరువల్లూరి కృష్ణమాచారి పాల్గొన్నారు.

40 రోజులు కష్టపడి పార్టీని గెలిపించుకుందాం

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

అల్లూరు, ఫిబ్రవరి 21 : రానున్న నలభై రోజులు కష్టపడి రాష్ట్రంలో టీడీపీని గెలిపించుకుందామని ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పిలుపునిచ్చారు. అల్లూరులోని డీఎస్ఆర్ ట్రస్ట్‌లో బుధవారం రాత్రి మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ పార్టీ చేయలేని అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని గర్వంగా చెప్పుకొని ఓటు అడిగే హక్కు తమ పార్టీకే ఉందన్నారు. వైసీపీ ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరిగిందో చూపలేని స్థితిలో ఉందన్నారు. అదేవిధంగా కావలి ఇన్‌చార్జిగా దగుమాటి వెంకట కృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి)ని అధిష్ఠానం నియమించిందని, ఆయన నాయకత్వంలో పనిచేసేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు.

రాజకీయ భిక్ష పెట్టింటి బీద రవిచంద్ర : కృష్ణారెడ్డి

తనకు రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రేనని ఆయన అడుగు జాడల్లో తాను నడిచేందుకు సిద్ధంగా ఉన్నానని కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన వారికే పెద్దపీట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలేపాటి సుబ్బానాయుడు, బీద గిరిధర్, బొమ్మి సురేంద్ర, బుల్లా కృష్ణారెడ్డి, కొండూరు పోలిశెట్టి, బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, రఫీమాలిక్, తోట శ్రీహరి, పావనబోయిన రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాతూరు నుంచి టీడీపీలోకి వలసలు

కావలి : కావలి పట్టణం పాతూరు 5వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు కాటా శ్రీనివాసులురెడ్డి తన అనుచరులతో బుధవారం ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరగా వారికి కండువా వేసి ఇన్‌చార్జి కృష్ణారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



తెలుగుతల్లికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కందుకూరు, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను బుధవారం పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర, ఐక్యూఏసీ కో ఆర్డినేటరు పి.రాజగోపాలబాబు, తెలుగు విభాగాధిపతి కె.సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు. మండలంలోని ఓగూరు వద్ద ఉన్న సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని తెలుగు ఉపాధ్యాయుడు, కవి ఇనకొల్లు మస్తానయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం తెలుగుభాషపై నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గడ్డం బాబూరావు, ప్రసాద్, దుర్గాప్రసాద్, రఫి, కవిత, శ్రీవాణి, భావన తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

కావలిటౌన్ : ఇందిరానగర్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరిగింది. ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విశ్రాంత వసతి గృహ సంక్షేమ అధికారి, స్వచ్ఛంద సంస్థల వేదిక గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, పాఠశాల హెచ్ఎం లక్ష్మయ్య పాల్గొని తెలుగు భాషా పితామహులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాష ఔన్నత్యంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రఘునాథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



సెబ్ అధికారులతో వైన్‌షాపుల సూపర్‌వైజర్లు

కావలి రూరల్, ఫిబ్రవరి 21: వైన్ షాపుల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ సీఐ టీ.లక్ష్మణస్వామి పేర్కొన్నారు. కావలి సెబ్ కార్యాలయంలో బుధవారం కావలి, జలదంకి, బోగోలు మండలాలకు చెందిన 15 వైన్‌షాపుల సూపర్‌వైజర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ లక్ష్మణస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సీసాలు బెల్టుషాపులకు సరఫరా చేసినా, ఒక వ్యక్తికి 3 సీసాల కంటే ఎక్కువ ఇచ్చినా వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మ్యానువల్‌గా ఇవ్వకూడదని, ప్రతి సీసాను తప్పనిసరిగా స్కానింగ్ చేసి ఇవ్వాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ రాజశ్రీ, ఎక్సైజ్ ఎస్ఐ సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో ట్రాఫిక్ కష్టాలు



బోగోలు రైల్వేగేటు వద్ద ఆగిన వాహనాలు

బిట్రగుంట, ఫిబ్రవరి 21: బోగోలులో బుధవారం సాయంత్రం అర్ధగంటకుపైగా ట్రాఫిక్ నిలిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. మూడవ రైల్వే లైన్ ప్రారంభించినప్పటి నుంచి ఎల్సీ గేట్-144 నాలుగు నుంచి ఆరు రైళ్లకు వేయడం, తీసిన వెంటనే మూయడం జరుగుతుండడంతో భారీ, ద్విచక్రవాహనాలు గంటలు తరబడి నిలిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా వైద్యం కోసం వెళ్లే రోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యలు దృష్టిలో పెట్టుకుని రైల్వే అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ రవికుమార్

కావలిటౌన్, ఫిబ్రవరి 21: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంపైనున్న సమావేశ మందిరంలో సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. ముఖ్య అతిథిగా జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ పాల్గొని ఎగ్జిబిట్స్ తిలకించారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విజేతలకు 28న జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుంది. కార్యక్రమంలో హరినాథ్, సుబ్బరాయశర్మ, హరినారపరెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయాలి

కావలి, ఫిబ్రవరి 21: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాదిగ ఈ నెల 26న కావలిలో పర్యటిస్తారని ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయకృష్ణ మాదిగ తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల భవిష్యత్ కార్యాచరణ్‌పై విస్తృతస్థాయి సమావేశం కావలిలో జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాను ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి మాదిగలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నేతలు పందిటి అంబేడ్కర్ మాదిగ, గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, చేవూరు కిరణ్‌మాదిగ, గేరా జానకి, గంగపట్ల సంపాద్రి, రామ్మోహన్, దర్శిగుంట వాసు, మహేష్, రమణయ్య, కత్తి శివయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి హామీ గ్రామ సభలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 : మడలంలోని 21 గ్రామ పంచాయతీలలో గురువారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న చుండి, బడేవారిపాలెం, అమ్మపాలెం, 23న నలదలపూరు, అయ్యవారిపల్లె, అంకభూపాలపురం, శాఖవరం, కొండారెడ్డిపాలెం, కొండసముద్రం, 24న లింగపాలెం, నూకవరం, 25న శామీరపాలెం, 26న పోకూరు, పోలినేనిచెరువు, శింగమనేనిపల్లె, నేకునాంపురం, వలేటివారిపాలెం, కళవళ్ల, జమీన్‌ఉప్పలపాడు పంచాయతీలలో గ్రామ సభలు జరగనున్నట్లు తెలిపారు.

27న సామాజిక ప్రజావేదిక : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 27న ఉపాధి హామీ సామాజిక ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

29న మాలకొండలో దుకాణాలకు వేలం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 : మండలంలోని అయ్యవారిపల్లె పంచాయతీ మాలకొండలో వివిధ దుకాణాలకు ఈ నెల 29వ తేదీన బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేది జరిగిన వేలం పాటలలో వివిధ కారణాల వలన 5 దుకాణాల వేలం వాయిదా పడింది. వీటికి మళ్లీ వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఆర్‌లో ఒక్క ఆర్ పోతే పార్టీకి ఇబ్బందేమీలేదు : బీద



మాట్లాడుతున్న ఎంపీ బీద మస్తాన్‌రావు

అల్లూరు, ఫిబ్రవరి 21 : కావలి నియోజకవర్గానికి ఉన్న ట్రిపుల్ ఆర్‌లో ఒక్క ఆర్ పోతే ఇబ్బందేమీ లేదని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. అల్లూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి పార్టీని వీడి వెళ్లడంపై ఆయన మాట్లాడుతూ ఆర్‌పీఆర్, బీఎంఆర్, వీపీఆర్‌లో ఒకరు వెళ్లిపోయినంతమాత్రాన పార్టీకి ఒరిగేదేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, నీలం సాయికుమార్, దర్శిగుంట శశిరేఖ, వేణమ్మ, కోడూరు సాదక్‌రెడ్డి, బిట్రగుంట రమేష్‌రెడ్డి, బీద రమేష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఆత్మీయ సమావేశం

బిట్రగుంట : బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణంలో వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు ఆధ్వర్యంలో బుధవారం వైసీపీ నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు కష్ట పడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం.సుజాత, జడ్పీటీసీ ఎం.కీర్తన, సర్పంచులు పీ.అనిత, రాయి.వినోద్ యాదవ్, నాయకులు దేవరాలసుబ్రహ్మణ్యం, ఎస్.కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, నవాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కాకాణికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం : సోమిరెడ్డి


వెంకటాచలం : టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 21: కాకాణి చేసిన పాపాలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని సోమిరెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం వెంకటాచలం మండలం కసుమూరు పంచాయతీ పుల్లతీగలపాడు గ్రామానికి చెందిన 10 కుటుంబాలు సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి కండువాలు కప్పి మాజీ మంత్రి సోమిరెడ్డి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కాకాణి చేసే అరాచకాలను సహించలేక వైసీపీని వీడి టీడీపీలో చేరారని, ఎన్నికల కోడ్ విడుదలైతే చేరికలు మరింత పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం శ్రీనివాసులునాయుడు, నాయకులు కడివేటి వెంకటేశ్వర్లు, మునిరెడ్డి, కడివేటి శేషయ్య, కూరపాటి మస్తానయ్య, మందా రమణయ్య, నలబాలపు తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు : ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో బుధవారం టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సోమిరెడ్డికి గ్రామ టీడీపీ నాయకులు మన్నెమాల భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డిలు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటా తిరిగి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ కందల పెంచలయ్య, గుమ్మా శ్రీనువాసులు యాదవ్‌తో పాటు వారి అనుచరులు పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి సోమిరెడ్డి సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, రామకృష్ణయ్య, మస్తాన్‌నాయుడు, పెంచల్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, నూనె లక్ష్మయ్య, పచ్చిపాల రామిరెడ్డి, తిక్కవరపు వెంకటేశ్వర్లు రెడ్డి, రాజా గౌడ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

● డ్వామా పీడీ వెంకట్రావు


మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావు

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 21 : జాతీయ ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకట్రావు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణాభి వృద్ధి ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. రూ. 92వేల రికవరీ ఆదేశించినట్లు తెలిపారు. ప్రధానంగా సౌత్‌ఆములూరు ఉపాధి హామీ పనుల రికార్డుల్లో లోపాలపై గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌ను హెచ్చరించారు. మల్లికార్జునపురంలో ఓ రైతు ఉపాధి హామీ పనుల ద్వారా చేసిన కాలువను తన అవసరాల కోసం పూడ్చివేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ రైతుకు నోటీసు జారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కౌసల్య, ఏపీవో సీహెచ్ శ్రీహరి, క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్, అంబుడ్స్ పర్సన్ వెంకటరెడ్డి, ఎస్ఆర్‌పీ వెంకయ్య, జడ్పీటీసీ శేషమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, ఎంపీటీసీ రాయపు శ్రీనివాసులు, మండల ఉపాధి హామీ అధికారి అచ్చయ్య, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

కంటేపల్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

వెంకటాచలం, ఫిబ్రవరి 21 : మండలంలోని కంటేపల్లి గ్రామంలో బుధవారం విక్రమ సింహపురి యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత, సోషల్ వర్క్ అధ్యాపకుడు డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాలకు ఉచిత సేవలు


మాట్లాడుతున్న న్యాయసేవా అధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

వెంకటాచలం, ఫిబ్రవరి 21 : సమాజంలోని వెనుకబడిన వర్గాలకు, మహిళలకు ఉచిత సేవలు అందజేయాలని న్యాయసేవా అధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తెలిసో తెలియకో చేసిన తప్పులు మరలా చేయరాదని, ఇక నైనా బయటకు వెళ్లిన తర్వాత మంచిగా జీవించాలని, తల్లిదండ్రులు, భార్యా బిడ్డలతో సంతోషంగా ఉండాలని సూచించారు. అవసరమైతే ఉచితంగా లాయర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జైలర్ జీవీ రమణయ్య తదితరులున్నారు.

పరిశ్రమలలో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

● రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

వెంకటాచలం, ఫిబ్రవరి 21: తనకు సంబంధించిన పరిశ్రమల్లో విక్రమ సింహపురి యూనివర్సిటీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం ఇంటెర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాల కల్పనపై యూనివర్సిటీ వీసీ సుందరవల్లి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వచ్చిన వ్యాపారవేత్తలను వీసీ కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ సీహెచ్ఈ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవి సన్నారెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్తలు ఏపీకే రెడ్డి, దొడ్ల శేషారెడ్డి, ఎన్వి రమణారెడ్డి, జీజే రావు, కేపీ సుధాకర్, సతీష్ కామత్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 21: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని కళాజాత బృందం సభ్యుడు బాబురావు అన్నారు. బుధవారం మండలంలోని జొన్నవాడలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో కళాజాత బృందం వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ సోకినవారిపట్ల నడుచుకోవాల్సిన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస క్లబ్ బృందం బాబురావు ఆధ్వర్యంలో స్టాలిన్, విజయ్, జాను, కేయస్ రాజు, బాబు, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

'చీదరాల'కు తెలుగుభాషా సేవా పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 21: బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ఉపాధ్యాయుడు చీదరాల చెన్నయ్యకు తెలుగుభాషా సేవా పురస్కారం లభించింది. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్ర లయోలా కళాశాల ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని లయోలా కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగుభాషా సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. అందులో భాగంగా చెన్నయ్యను సత్కరించి మెమెంటో, మెడల్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళిమోహన్‌రాజు, డాక్టర్ కోలా శేఖర్, కిరణ్‌కుమార్, రాయప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 21: స్థానిక డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగం శోభన్‌బాబు అధ్యక్షతన జరిగింది. మాతృభాష దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసత్తా రాష్ట్ర కన్వీనర్ చింతల దయాకర్, స్కూలు అసిస్టెంట్ మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నృసింహ స్వామి సన్నిధిలో మంత్రి కాకాణి దంపతులు


పెంచలకోన నృసింహ స్వామి ఆలయంలో మంత్రి కాకాణి దంపతులు, నేదురుమల్లి

రాపూరు (డక్కిలి), ఫిబ్రవరి 21 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి ఆయన సతీమణి విజిత బుధవారం పెంచలకోనలోని నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిషనర్ సాగర్‌బాబు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు మంత్రి దంపతులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అయన వెంట రాష్ట్ర కమ్యూనిటీ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టీడీపీ నేతకు పోలంరెడ్డి పరామర్శ

కోవూరు, ఫిబ్రవరి 21: పోతిరెడ్డిపాళెం గ్రామ టీడీపీ నాయకుడు డాక్టర్ తొట్టెంపూడి అంకయ్య తండ్రి బుజ్జయ్య మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంకయ్య కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, తిరుమూరు రవీంద్రరెడ్డి, యద్దలపూడి నాగరాజు, నాటకరాని వెంకట్ తదితరులున్నారు.

కామాక్షితాయికి బంగారు ముంగర బహూకరణ


దాతలు బహూకరించిన తెల్లరాళ్ళ బంగారు ముంగర

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 21: మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయికి హైదరాబాదుకు చెందిన దాతలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, పద్మసరిత బుధవారం రూ.60వేలు విలువచేసే 9.860 గ్రాముల తెల్లరాళ్ల బంగారు ముంగరను బహూకరించారు. ముందుగా ముంగరను అమ్మవారికి అలంకరించి ఆలయ ఈవో గిరిక్రిష్ణకు అందజేసి రసీదు పొందారు.

ఏషియన్ గేమ్స్‌కు శ్రీరామకృష్ణారెడ్డి

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 21 : ఏషియన్ గేమ్స్‌లో పెన్ కాక్ సిలాట్ విభాగానికి బుజబుజనెల్లూరులోని శేష పాఠశాల విద్యార్థి విజయ శ్రీరామ కృష్ణారెడ్డి ఎంపికయ్యాడని ఆ పాఠశాల కరస్పాండెంట్ బీ శేష తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విజయ శ్రీరామ కృష్ణారెడ్డి మహారాష్ట్ర నాందేడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 17, 18వతేదీల్లో జరిగిన పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించ పురుషుల టండింగ్ (ఫైటింగ్) విభాగంలో అఖిలభారత స్థాయిలో కాంస్య పతకం సాధించాడని చెప్పారు. త్వరలో జరిగే ఏషియన్ గేమ్స్‌లో జూనియర్ విభాగానికి దేశం తరఫున ఎంపికవడం అభినందనీయమన్నారు.

రూ.65 లక్షల కార్పొరేషన్

స్థలం ఆక్రమణ


ఆక్రమిత స్థలంలో నిర్మాణం

- మూడుసార్లు నోటీసులిచ్చి హెచ్చరించిన అధికారులు
- అయినా లెక్కచేయని వైసీపీ నాయకులు
- కౌన్సిల్ తీర్మానంతో సొంతం చేసుకునేందుకు కసరత్తు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 21 : నెల్లూరు నగర పరిధిలోని ప్రభుత్వ స్థలాలను అధికార పక్షం నాయకులు స్వాహా చేసేస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన స్థలం అనగానే ఏదో ఒక రూపంలో కాజేసేందుకు యత్నిస్తున్నారు. ఇలాంటివి తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే సిటీ నియోజకవర్గ పరిధిలోని 6వ డివిజన్ పప్పులవీధిలో కార్పొరేషన్‌కు చెందిన రూ.65 లక్షలు విలువ చేసే 5 అంకణాల స్థలం కబ్జాకు గురైంది. స్థానిక పార్కు వద్దనున్న ఈ స్థలాన్ని కొన్ని రోజుల క్రితం ఆక్రమించుకుని భవన నిర్మాణం చేపడుతున్నారు. స్థానికుల ఆందోళనలో రంగంలోకి దిగిన సిటీప్లానింగ్ అధికారులు నిర్మాణాలు ఆపాలని హెచ్చరిస్తూ వరుసగా మూడుసార్లు నోటీసులు జారీ చేశారు. అయినా ఏ మాత్రం లెక్కచేయని ఆక్రమార్కులు నిర్మాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. కడుపుమండిన స్థానికులు ఇటీవల రిలే దీక్షలు చేపట్టినా అక్రమ నిర్మాణం మాత్రం ఆగలేదు. పైగా ఆ స్థలాన్ని అధికారికంగా హస్తగతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఆ ప్రాంతంలో పేద వారు నివసిస్తున్నట్లు, వారి దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్లాంటు అవసరమని, అందుకోసం ఆ స్థలాన్ని లీజు పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తికి అప్పగించాలన్నట్టు పత్రం సిద్ధం చేశారని తెలిసింది. దానిని కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదింపజేసుకుని సభ తీర్మానంతో సొంతం చేసుకునేలా ఫైల్ నడుపుతున్నట్లు సమాచారం. త్వరలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఆ ఫైల్‌ను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. కాగా, ప్రస్తుత ఆక్రమిత స్థలం పక్కన కార్పొరేషన్ కాంప్లెక్స్ ఉంది. దాని నిర్మాణం సమయంలో ఈ స్థలాన్ని భవిష్యత్తులో ఎలాంటి అవసరాలకు వాడకూడదని నిర్ణయిస్తూ సెట్‌బ్యాక్ స్థలంగా వదలడం గమనార్హం.

ఇంకా చాలా మార్పులు జరుగుతాయి !

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ


పార్టీలో చేరిన వారితో నారాయణ, కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 21 : వైసీపీ విధానాల వల్ల నేతలు ఆ పార్టీని వీడుతున్నారు.. ఇంకా చాలా మార్పులు జరుగుతాయి.. వెయిట్ అండ్ సీ అంటూ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వైసీపీకి రాజీనామా చేయటంపై మాజీ మంత్రి పొంగూరు నారాయణ వ్యాఖ్యానించారు. బుధవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం 48వ డివిజన్‌లో జరిగింది. ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఆటోకార్మికులు టీడీపీలో చేరారు. వారికి నారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని, ముఖ్యమంత్రి జగన్ పాలనకు వ్యతిరేకంగా పలువురు పార్టీని వీడుతున్నారని అన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మొన్నటి వరకు తొడలు కొట్టి, మీసాలు తిప్పిన నేత ఇప్పుడు నరసరావుపేటలో పడ్డారంటూ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను విమర్శించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో నారాయణ లక్ష మెజారిటీతో గెలుస్తారని జోస్యం చెప్పారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం..

వైసీపీ పాలనలో నగరంలో అభివృద్ధి కుంటుపడిందని పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి విమర్శించారు. 42వ డివిజన్ మన్సూర్‌నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికి తిరిగి నారాయణను గెలిపించాలని కోరారు.

సచివాలయ సెక్రటరీలకు 'షోకాజ్'

● పన్ను వసూళ్లలో ప్రగతి చూపనందుకు తాఖీదులు


సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 21 : కార్పొరేషన్‌కు రావాల్సిన ఆస్తి, కొళాయి, డ్రైనేజీ పన్నుల వసూళ్లలో ప్రగతి చూపని సచివాలయ కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీ చేయాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సెక్రటరీలతో రెవెన్యూపై ఆయన సమీక్షించారు. నగరంలోని ప్రతి భవనం పన్ను పరిధిలోకి రావాలని స్పష్టం చేశారు. మొండి బకాయిదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో పన్ను వసూళ్ల కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పౌరులుగా విధిగా పన్ను చెల్లించి నగర అభివృద్ధిలో భాగస్వాములయ్యేలా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. రోజువారీ వసూళ్ల వివరాలు ప్రధాన కార్యాలయానికి తెలపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ శర్మద, డీసీ చెన్నుడు, ఎస్ఈ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్ల పేరుతో వేధింపులు ఆపాలి: ఏఐఎస్ఎఫ్


ఏవోకి వినతిపత్రం అందచేస్తున్న నేతలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 21 : ముందస్తు అడ్మిషన్ల పేరుతో కార్పొరేట్ కళాశాలలు పదో తరగతి విద్యార్థుల ఇళ్ల చుట్టూ తిరుగుతూ వేధించడం వెంటనే ఆపాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగరంలోని ఆర్ఐవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందచేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల సిబ్బంది పదో తరగతి పరీక్షలు ప్రారంభం కాకముందే విద్యార్థుల ఇళ్ల చుట్టూ తిరుగుతూ వేధిస్తున్నారన్నారు. విద్యార్థులు స్వతంత్రంగా వారికి నచ్చిన కళాశాలలో చేరే హక్కును కాలరాస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు శివం వర్మ, ప్రసాద్, అబ్దుల్, మౌళి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటి సుధాకర్‌కి

టికెట్ ఇవ్వాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 : అర్థ బలం, అంగ బలం ఉన్న బీసీ నాయకుడు పసుపులేటి సుధాకర్‌కు కావలి నియోజకవర్గం అసెంబ్లీ టికెట్ కేటాయించాలని టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలకు జిల్లా వడ్డెర సంఘం నాయకుడు బెల్లంకొండ చిన్నయ్య కోరారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం వడ్డెర్లకు 12 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలు కేటాయించాలన్నారు. తమ ఓటు బ్యాంకును గుర్తించి ఏ పార్టీ అయినా పసుపులేటి సుధాకర్‌కు కావలి టికెట్ కేటాయిస్తే తమ మద్దతు ఆ పార్టీకే ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మల్లి శంకర్, పల్లపు రత్నం, గుంజి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యక్తిత్వ శిక్షణ శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 : వ్యాపారులు, విద్యార్థులు, యువతీ యువకులకు గురువారం సాయంత్రం 4 గంటలకు వ్యక్తిత్వ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు జీఎంఆర్ రియల్ ఎస్టేట్ డైరెక్టర్ జే ఉమాపతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తరగతులను వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ మేధా చిరంజీవి నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం వరిగొం డలోని శ్రీబాలాజీ గ్రీన్ సిటీలో జరుగుతుందని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నా భూమి నాకు ఇప్పించండి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 : నా కుటుంబానికి జీవనాధారమైన భూమిని వీఆర్వో టీ సుధాకర్ రికార్డులు తారుమారు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దారాదత్తం చేశారని కనుపర్తిపాడు గ్రామానికి చెందిన పర్వతాల రమణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సదరు భూమిని 70 ఏళ్లుగా సాగుచేసుకుంటూ జీవిస్తున్నానని తెలిపారు. వీఆర్వో సుధాకర్ చేసిన పనిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు కూడా ఇచ్చామని చెప్పారు. నీ భూమి నువ్వే సాగుచేసుకోమని కలెక్టర్ చెప్పినా కక్షకట్టి వీఆర్వో సుధాకర్ రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. ఆ వీఆర్వోపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

కనుల పండువగా

అంకురార్పణ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 : నవా బుపేటలోని ఉడయవర్లు దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం రాత్రి అంకురార్పణ ఘనంగా జరిగింది. విష్వక్సేనారాధన, మృత్సంగ్రహణం, విశేష పూజలు, హోమాలు జరిగాయి. భక్తులు కలిసి కల్యాణ తలంబ్రాలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పల్లాప్రోలు రామకృష్ణమాచార్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


వీపీఆర్‌ను కలిసిన సురేంద్రరెడ్డి

వీపీఆర్‌ను కలిసిన ప్రముఖులు


వీపీఆర్‌తో కేతంరెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 21 : వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని పలు వురు ప్రముఖులు కలిశారు. నెల్లూరు రూర ల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కలిశారు. బుధవారం వైసీపీకి వీపీఆర్ రాజీనామా చేసిన తర్వాత ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతలు వీపీఆర్ నివాసానికి వెళ్లి పుష్ప గుచ్ఛంతో అభి నందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలపై వీపీఆర్, కోటంరెడ్డి చర్చిం చుకున్నారు. అనంతరం కోటంరెడ్డి విలేకరులతో మాట్లా డుతూ ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మన్నన పొందిన వీపీఆర్‌కు ఇకపై అంతా మంచే జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే వేదగిరి క్షేత్రం ఛైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌కుమార్, మాజీ మేయర్ భానుశ్రీ తదితరులు వీపీఆర్‌ను కలిశారు.

టీడీపీలోకి వలసలు

నెల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి బుధవారం తెలుగుదేశం పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. నగరంలోని పలు డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన యువతకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. బుట్టిరెడ్డి మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత టీడీపీలో చేరింది. 31వ డివిజన్ ఓగూరుపాడు, కిచ్చరగుంట, గిరిజనకాలనీ ప్రాంతాలకు చెందిన వారు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు మన్నేపల్లి రఘు, బత్తల కృష్ణ, పల్నాటి మస్తాన్‌నాయుడు, సాబీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మాతృభాషా దినోత్సవం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 21 : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని పలు పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్‌రావు మాట్లాడుతూ ఇంగ్లీష్ మోజులోపడి అమ్మభాషను మరవద్దని, మాతృభాష తల్లి ఒడితో సమానమని తెలిపా రు. అనంతరం విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించగా ఐదో తరగతి విద్యార్థిని శ్రుతి 30 పద్యాలు చెప్పి ప్రథమ బహుమతి, సంజన ద్వితీయ, కుసుకు ప్రియ తృతీయ బహుమతి గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, రాశి పాల్గొన్నారు.

● క్రాంతినగర్ ఎంసీయూపీ పాఠశాలలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుభాషోద్యమ సమితి నాయకుడు చలంచర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మాతృభాషకు ఎంతో ప్రాముఖ్యం ఉందని, ఎంతోమంది మేధావులు, ప్రముఖులు మాతృభాషలోనే చదువుకుని ఉన్నతంగా ఎదిగారన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో నేటికీ మాతృభాషలోనే విద్యాబోధన సాగుతోందని చెప్పారు. మాతృభాషలోనే విద్యను కొనసాగించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో వేదం సూర్య ప్రకాష్, జయప్రకాష్, రత్నప్రసాద్, అరుణ, ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రాజరాజేశ్వరికి ఊంజల్‌సేవ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం మాఘ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ఊంజల్ సేవ జరుగుతుందని ఆలయ ఛైర్మన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ జే వెంకట సుబ్బయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటకు సామూహిక లలితా సహస్ర నామ పారాయణం, సౌందర్య లహరి, సంగీతం, వీణా వాయిద్యం, నాట్యం, షోడశోపచార పూజ జరుగుతాయని తెలిపారు. భక్తులు అందరూ పాల్గొనాలని కోరారు.



ఎస్వీయూలో ర్యాలీ నిర్వహించిన విద్యార్థి సంఘాల నాయకులు

ఇది ప్రజాస్వామ్యంపై దాడి

కొడాలి నోరు అదుపులో పెట్టుకోవాలి

జర్నలిస్టులపై దాడులు చూస్తుంటే పాలకులే ప్రోత్సహిస్తున్నట్లుంది

రోడ్లపైకొచ్చిన విద్యార్థి సంఘాలు, టీడీపీ శ్రేణులు

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను విద్యార్థి సంఘాలు, టీడీపీ శ్రేణులు ఖండించాయి. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిగా నాయకులు అభివర్ణించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం జిల్లాలో పలుచోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్వీయూలో విద్యార్థి సంఘాల ర్యాలీ, నిరసన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 21: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై పాశవికంగా దాడి చేసిన వైసీపీ రౌడీలను వెంటనే అరెస్టు చేయాలని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండు చేసింది. తిరుపతిలోని ఎస్వీయూనివర్సిటీలో బుధవారం వివిధ విద్యార్థి సంఘాలు ఐక్యంగా విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం వర్సిటీ మెయిన్ గేట్ వద్దనున్న అంబేడ్కర్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టాయి. టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, టీఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘం, నవ సమాజ గిరిజన విద్యార్థి ఫెడరేషన్ తదితర సంఘాలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొడాలి నాని జర్నలిస్టుల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో నిత్యం జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ప్రజల గొంతుకగా పనిచేసే పత్రికల స్వేచ్ఛకు భంగం కల్గుతోందన్నారు. దాడులను అరికట్టాల్సిన పాలకులే ప్రోత్సహిస్తున్నట్టుగా ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే శ్రీకృష్ణపై దాడి జరిగి మూడ్రోజులైనా ఇంతవరకు నిందితులను అరెస్టు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పత్రికలు, జర్నలిస్టుల గొంతు నొక్కినా అంతిమంగా ప్రజల గొంతు నొక్కినట్టేనని అభిప్రాయపడ్డారు. ఇసుక అక్రమ రవాణపై వార్త రాసిన ఓ జర్నలిస్టుపై అమరావతిలోనూ, పుట్టపర్తిలో ఈనాడు ఫొటోగ్రాఫర్‌పైన, రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పైన దాడి చేయడం దుర్మార్గమని చెప్పారు. వీటిపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కేవీబీపురంలో కళ్లకు గంతలు కట్టుకుని టీడీపీ నిరసన

పత్రికా స్వేచ్ఛపై దాడి చేస్తే పతనం తప్పదు

సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్

కేవీబీపురం ఫిబ్రవరి 21: పత్రికా స్వేచ్ఛపై దాడి చేసిన వారికి పతనం తప్పదని సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ అన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిని నిరసిస్తూ బుధవారం మండలంలోని విలేకర్లతో కలిసి ఆమె, టీడీపీ నాయకులు కళ్లకు నల్లవస్త్రం ధరించి స్థానిక సాయిబాబా గుడి ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ నాయకుడు మునిస్వామి యాదవ్, రాజా రెడ్డి, లోకేష్ నాయుడు, వెంకటకృష్ణయ్య, మునికృష్ణయ్య, బాల, సురేష్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి



ఏర్పేడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతల నిరసన

ఏర్పేడు, ఫిబ్రవరి 21: సీఎం జగన్, ఆయన అనుచరుల్ని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు చేసిన దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. 2004లో వైఎస్ ముఖ్యమంత్రి అయ్యాక ఇదే తరహాలో పత్రికా స్వేచ్ఛను హరింపజేయడానికి ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. అదే క్రమంలో ప్రస్తుతం జగన్ కూడా తాను చేస్తున్న తప్పులను బయటపెడుతున్న ఆంధ్రజ్యోతిపై తరచూ విరుచుకుపడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణవేణి, గుణయాదవ్, సుబ్రహ్మణ్యం, రమణయ్య, భాస్కర్‌నాయుడు, నరసింహులుయాదవ్, శివశంకర్‌రెడ్డి, నిరంజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే దాడులు

- గవర్నర్, హైకోర్టు స్పందించి విచారణ చేపట్టాలి: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 21: 'ఓ పథకం ప్రకారం రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడి జరుగుతోంది. ఈ విషయంలో రాష్ట్ర గవర్నర్, హైకోర్టు స్పందించి.. విచారణ చేపట్టాలి' అని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో జర్నలిస్టులు విధులు నిర్వహించాలన్నా భయపడేలా వైసీపీ కార్యకర్తలను ఉసిగొల్పి దాడులు చేయించి, సోషల్ మీడియాలో వైరల్ చేయిస్తున్నారని చెప్పారు. ఇలా చేస్తే జర్నలిస్టులు భయపడతారనేది వారి అవివేకమన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులను సైతం లోబరచుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసి.. దొంగ ఓట్లతో గెలవాలన్న ఆలోచనతో వాస్తవాలు బయట పెట్టకూడదని మీడియాను టార్గెట్ చేశారని అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేకుండా పోయిందన్నారు. వెంటనే కేంద్ర బలగాలతో రాష్ట్రంలో పర్యవేక్షణ చేసేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వైసీపీ పాలనను ప్రజలు ఛీకొట్టారని, ఓటమి భయంతో ముఖ్యమంత్రి ఏం చేస్తున్నాడో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ, జనసేన కూటమిదే విజయం అని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్ మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడి చేసిన వ్యక్తులపై పీడీ యాక్టు నమోదు చేయాలని, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని.. ఎపుడు ఎన్నికలొచ్చినా బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్, మనోహర్ ఆచారి, సుధాకర్‌రెడ్డి, నాగప్రతాప్, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

నా బిడ్డలున్నారన్న నమ్మకంతోనే

మీ ముందుకు వచ్చాం





శాంతిపురంలో మహిళల ముఖాముఖిలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

- ప్రభుత్వ అరాచకాలనుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాం
- 'ఆడబిడ్డలకు ఆర్థిక స్వేచ్ఛ' ముఖాముఖిలో నారా భువనేశ్వరి

కుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 21: 'నా ఫ్రెండు ఒకరు చెప్పారు, బయట తిరగొద్దని. ఈ ప్రభుత్వం ఏమైనా చేస్తుందని, ఎంతకైనా తెగిస్తుందని భయపెట్టారు. కానీ, నా బిడ్డలున్నారన్న నమ్మకంతోనే నాతో సహా చంద్రబాబు, లోకేశ్ రాష్ట్రంలో పర్యటిస్తున్నాం. ఈ ప్రభుత్వ అరాచకాల నుంచి రాష్ట్రాన్ని, మిమ్మల్ని కాపాడుకోవడానికి అహర్నిశలు ప్రయత్నిస్తున్నాం' అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమ పర్యటనలో భాగంగా బుధవారం ఆమె శాంతిపురంలో 'ఆడబిడ్డలకు ఆర్థికస్వేచ్ఛ' అంశంపై మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. మహిళల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. సరదా వ్యాఖ్యలూ చేశారు.



మమత, కర్లగుట్ట: చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు 53 రోజులపాటు మీరెలా గడిపారు? మీరు ఎదుర్కొన్న సమస్యలేమిటి?

భువనేశ్వరి: చంద్రబాబు అరెస్టు విషయంలో ఏమాత్రం భయపడలేదు. ఆయన చాలా ధైర్యంగా ఉన్నారు. ఆయన జైలుకు వెళ్లడంతో బాధపడిన, మనస్తాపంతో చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించమన్నారు. ధైర్యం చెప్పమన్నారు. జైల్లో ఉండీ ఈయన ఏమిటి ప్రజల గురించి ఆలోచిస్తున్నారని నేను కొంత నిరాశ చెందిన మాట నిజం. కానీ ఆయన అక్రమ కేసులో నిర్బంధానికి గురైనప్పుడు మీరు పడిన బాధ, నిర్బంధాలు, పోలీసు ఆంక్షలకు వెరవకుండా చేసిన నిరసనలు చూసి నేను చాలా ప్రభావితురాలలయ్యా. మీ కుటుంబాలను ఓదార్చి, భరోసా ఇవ్వడానికే ఈ పర్యటనలు పెట్టుకున్నా.



విజయలక్ష్మి, గుండిశెట్టిపల్లె: భోంచేసేటప్పుడు ఏ విషయాల గురించి ఎక్కువగా చర్చింకుంటారు?

భువనేశ్వరి: కనీసం భోజనం సమయంలోనైనా కుటుంబ విషయాలు మాట్లాడుదామంటే ఇటు తిరిగి, అటు తిరిగి చంద్రబాబు ప్రజలవద్దకే వస్తారు. లోకేశ్‌కన్నా షార్ప్‌గా ఆలోచిస్తారు. 2047 విజన్‌తో ముందుకెళుతున్న ఆయన్ను పట్టుకుని ఈ ప్రభుత్వం వయసైపోయింది అంటుంది. కానీ ఆయన ఇంకా యంగ్‌స్టర్. ఆయనలా ఆలోచిస్తున్నాడు కాబట్టే నేనిలా నిజం గెలవాలి కార్యక్రమంలో మీ ముందుకు వచ్చా. మీరు చూపిస్తున్న ప్రేమానురాగాలను ఎప్పటికీ మరవలేం.



కౌసల్య, కుప్పం: నృత్య తదితర కళలను మీరెలా ప్రోత్సహిస్తారు?

భువనేశ్వరి: నేను వెంకట చిన సత్యం దగ్గర కూచిపూడి, భరతనాట్యం 11 సంవత్సరాలు నేర్చుకున్నా. నాకు కళలంటే చాలా ఇష్టం. చంద్రబాబు కూడా అధికారంలో ఉన్నప్పుడు కళాకారులను ప్రోత్సహించారు. మళ్లీ అధికారంలోకి వస్తే మరింత ప్రాధాన్యం ఇస్తారు.



జ్యోత్స్న, కొలమడుగు: గార్మెంట్స్‌లో పనికోసం మేము శాంతిపురంనుంచి కుప్పం వెళ్తున్నాం. ఇక్కడే మాకు పరిశ్రమలు తెస్తే బావుంటుంది.

భువనేశ్వరి: చంద్రబాబు అధికారంలో ఉండగా కుప్పంలో పరిశ్రమలు చాలా వచ్చాయి. ఈ ప్రభుత్వం వచ్చాక వచ్చిన పరిశ్రమలు కూడా వెనక్కి వెళ్లిపోయాయి. జిల్లాలో అమరరాజా, అనంతపురంలో జాకీ పరిశ్రమలు వెళ్లిపోయాయి. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం.



యువతేజశ్విని, పెద్దబొమ్మనపల్లె: కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా విద్యాసంస్థలు ఏర్పాటు చేసి పేదలకు ఉచిత విద్య అందించాలి.

భువనేశ్వరి: నాకు కూడా ఇంత దాకా ఈ ఆలోచన రాలలేదు. మంచి సలహా ఇచ్చావు. కచ్చితంగా మా మేనేజ్‌మెంట్‌తో ఆలోచన చేసి స్కూల్ ఏర్పాటు చేస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌నూ త్వరలో ప్రారంభిస్తాం.

అంతు చిక్కని జ్వరం

- తిరుమూరులో 80 మందికి పైగా అనారోగ్యం

వాకాడు, ఫిబ్రవరి 21: ముందుగా జ్వరం వస్తుంది. ఉన్నట్టుండి కాళ్లు, చేతులు, ముఖం వాపు వచ్చేస్తుంది. నొప్పులూ తీవ్రంగా ఉంటున్నాయి. జ్వరం తగ్గినా నొప్పులు మాత్రం అలాగే ఉంటున్నాయి. ఇలా అంతుచిక్కని జ్వరంతో వాకాడు మండలంలోని తిరుమూరు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ వ్యాధి బారిన పడినవారు 15 రోజులకు పైగా స్థానికంగా చికిత్స తీసుకున్నా.. తగ్గక పోవడంతో కోట, నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధి బారిన పడిన వారిలో.. నక్కా జమున, తిరుమూరు రామచంద్రయ్య, వల్లూరు చంద్రమ్మ, ప్రసూన్న, తిరుమూరు వెంకటయ్య, పామంజి చెంగయ్య, నక్కా రామసుబ్బమ్మ, కుంచం శేషమ్మ, కుంచం ఆదిలక్ష్మమ్మ కుటుంబం, గడ్డం పరసారత్నం కుటుంబం, చుట్టా పుల్లయ్య కుటుంబం, చింతల మణి, కుంచం రమణమ్మ, పాముల నాగేశ్వరరావు కుటుంబం ఇలా.. 80మందికిపైగా తిరుమూరు హరిజనవాడ ప్రతి ఇంటిలోనూ బాధితులున్నారు. దీనిపై తిరుమూరు సచివాలయంలో సమాచారం ఇచ్చినా స్థానిక వైద్యాధికారులు ఎవరూ రాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై నిడిగుర్తి పీహెచ్‌సీ వైద్యుడు రామకృష్ణ వివరణ కోరగా.. సమాచారం ఎవరూ చెప్పలేదని, గ్రామంలో అవసరమైతే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

నొప్పులు తగ్గడం లేదు



ఐదు రోజుల కిందట తీవ్ర జ్వరం వచ్చింది. కోటలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాను. ఆరోజు రాత్రికంతా జ్వరం తగ్గిపోయింది. అప్పటి నుంచి తట్టుకోలేని విధంగా నొప్పులు వస్తున్నాయి. ఎన్ని మాత్రలు మింగినా, ఇంజక్షన్లు వేయించుకున్నా నొప్పులు తగ్గడం లేదు.

- పామంజి చెంగయ్య, బాధితుడు

శరీరమంతా వాపులతో తట్టుకోలేకున్నా

ఎనిమిది రోజుల కిందట జ్వరం వస్తే కోటలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాను. జ్వరం తగ్గింది. అప్పటి నుంచి మొహం వాచి, కీళ్లు, మెడజీవాల నొప్పులతో ఇబ్బంది పడుతున్నా. నొప్పులు తగ్గక పోవడంతో మరో రెండు ఆస్పత్రులకు వెళ్లినా ఫలితం లేదు. శరీరం అంతా వాపులతో తట్టుకోలేక పోతున్నా.



- నక్కా జమున, బాధితురాలు

ఐఐటీలో నేడు స్నాతకోత్సవం

ఏర్పేడు, ఫిబ్రవరి 21: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో గురువారం 4, 5వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ముఖ్య అతిథిగా వర్చువల్‌గా ఢిల్లీ నుంచి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు డిగ్రీలను ఐఐటీ డైరెక్టర్ ప్రదానం చేయనున్నారు. ఈ స్నాతకోత్సవానికి హాజరు కావాలని తిరుపతి ఎంపీతో పాటు శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలకు, కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్ తదితరులకు ఆహ్వాన పత్రికలను రెండ్రోజుల కిందటే పంపారు. మరో ముఖ్య అతిథిగా జేఎస్‌డబ్ల్యూ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ పాల్గొననున్నట్లు డైరెక్టర్ వివరించారు.






కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నినాదాలు చేస్తున్న చింతా మోహన్

కార్పొరేషన్ అవినీతికి ఇదే సాక్ష్యం!

- స్మార్ట్‌సిటీ నిధులతో హోటల్ నిర్మించారంటూ చింతామోహన్ ధర్నా

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 21: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి కపిలతీర్థం వద్ద హోటల్ నిర్మించడం ఏమిటని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి హోటల్ ముందు ధర్నా చేశారు. హోటల్ నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తిరుపతి నగరపాలక సంస్థలో అవినీతి రాజ్యమేలుతోందనడానికి ఇదే సాక్ష్యం అన్నారు. కాగా.. తిరుపతి జూపార్కును మరోచోటుకు తరలించి, ఆ ప్రాంతంలో ఐటీ హబ్ నిర్మించాలని కోరారు. నిరుద్యోగ సమస్య శాశ్వత పరిష్కారానికి ఇది మార్గమని చెప్పారు. జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిటీ అధ్యక్షుడు గోపిగౌడ్, తిరుపతి జిల్లా లీగల్ అధ్యక్షుడు రవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తేజోవతి, ఓబీసీ జిల్లా అధ్యక్షురాలు శాంతియాదవ్, సేవాదళ్ అధ్యక్షురాలు మునిశోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.





కూలిన వంతెనకు మూడో వార్షికోత్సవం

- ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ వినూత్న నిరసన

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 21: డప్పుల మోత హోరెత్తింది. టపాసులు పేలాయి. భారీ పూలమాలలతో ఊరేగింపు తిరుపతి రూరల్ మండలం చిగురువాడ సమీపంలోని కూలిన వంతెన వద్దకు చేరుకుంది. జాతర సంబరాన్ని తలపించిన ఈ దృశ్యం చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి కుప్పకూలిందని చాటిచెప్పేందుకు ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధా యాదవ్ నిర్వహించిన వినూత్న నిరసన కార్యక్రమం. కూలిన వంతెనకు పూలమాల వేసి, మూడో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. చంద్రగిరి నియోజకవర్గంలో వానల ధాటికి మూడేళ్ల కింద ఐదు బ్రిడ్జిలు కూలిపోయాయని, వాటి అతీగతీ పట్టించుకునే వారే లేరని సుధాయాదవ్ ఆరోపించారు. తాయిలాలపై తాటికాయంత అక్షరాలతో పేర్లు వేసుకొని పంచేందుకు ఉన్న డబ్బులు, అభివృద్ధి పనులకు మాత్రం ఖర్చు చేయరా? అని నిలదీశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిలో చలనం లేనందున, ఆయనకు కనువిప్పు కలగాలనే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

తూనికల కొలతల అధికారుల దాడులు



ధాన్యం తూనిక రాళ్లను పరిశీలిస్తున్న లీగల్ మెటలర్జీ ఇన్‌స్పెక్టర్ మల్లేష్

నాయుడుపేట, ఫిబ్రవరి 21: నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లోని పలు దుకాణాల్లో తూనికల కొలతల అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ప్రధానంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుదారుల తూనిక గుండ్లపై దృష్టి సారించారు. పెళ్లకూరు మండలంలోని చెంబేడు, పెళ్లకూరు ప్రాంతాల్లో పర్యటించారు. ధాన్యం కొనుగోళ్లలో తూనిక రాళ్లకు సీళ్లు, బరువు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. అలాగే నాయుడుపేట మండలంలోని పూడేరు, పుదూరు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లదారుల తూనిక రాళ్లను పరిశీలించారు. నాయుడుపేట బస్టాండ్ ప్రాంతంలో శీతల పానీయాలు అధిక ధరలకు అమ్ముతుండటంతో రెండు దుకాణాలపై కేసు నమోదు చేశారు. అలాగే చికెన్ షాపులను తనిఖీ చేశారు. పాత పోస్టాఫీసు వీధిలోని ఓ దుకాణంలో తూనిక రాళ్లకు సీళ్లు లేనట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు తూనికల కొలతల అధికారి మలేష్ తెలిపారు. ఈ దాడుల్లో లీగల్ మెటలర్జీ సిబ్బంది రమణయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు

నాయుడుపేట, ఫిబ్రవరి 21: నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల్లో పలు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టారు. విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు... బెంగళూరుకు చెందిన ప్యారాచూట్ కంపెనీకి చెందిన కొబ్బరి నూనె పేరుతో నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల్లో డూప్లికేట్ నూనెను విక్రయిస్తున్నారు. ప్యారాచూట్ కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు బుధవారం రెండు పట్టణాల్లో దాడులు నిర్వహించి డూప్లికేట్ కొబ్బరి నూనె విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. 500 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ డీఐ నాగసురేష్, పీఆర్వో యామినీ సరస్వతి, డీసీటీవో మునీశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు నెలవల పరామర్శ



సత్యవరప్రసాదరావును పరామర్శిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

ఓజిలి, ఫిబ్రవరి 21: ఓజిలి మండలానికి చెందిన టీడీపీ నేత కంకణాల సత్యవరప్రసాదరావును సూళ్లూరుపేట ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఈనెల 12వ తేదీన సత్యవరప్రసాదరావు తండ్రి రామ్మోహన్‌రావు మృతి చెందారు. బుధవారం సత్యవరప్రసాదరావు ఇంటికి వెళ్లి నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. మంచి నాయకుడిని టీడీపీ కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఒంగోలుకు చెందిన తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడిని ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా అభివర్ణించారు. కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌కు గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, రఫీ, షైలాం జయచంద్రారెడ్డి, వేముల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

పెళ్లకూరు, ఫిబ్రవరి 21: సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారించవచ్చని జిల్లా వనరుల శాఖ సహాయ సంచాలకురాలు లక్ష్మీదేవి తెలిపారు. బుధవారం రోసనూరు గ్రామంలో నెల్లూరు జిల్లా ఆత్మ సంస్థ సహకారంతో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వరి, మిరప పంటలు, నిమ్మతోటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను ఆమె రైతులకు వివరించారు. మిరప పంటలో తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉందని, దీంతో ఆకుముడత వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు పిప్రోనిల్ 2ఎంఎల్ లీటరు నీటికి, ఎం45 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా నిమ్మతోటలను రసం పీల్చే పురుగు అయిన నల్లితిప్స్ ఆశిస్తోందని తెలిపారు. దీని నివారణకు ప్రాపోరైట్, ఓమైట్ 1ఎంఎల్ లీటరు నీటికి లేదా నీటిలో గంధకం 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే నల్లితిప్స్‌ను నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా భూసార పరీక్షా కేంద్రం అధికారులు పుష్పాంజలి, ఇందుప్రియ, మండల వ్యవసాయాధికారి గొడవర్తి ప్రవీణ, ఉద్యాన శాఖాధికారి కె.శారద, వీపీఏలు రాజేష్, శ్రీరాములు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కందనూరు బాపూజీ సేవలు చిరస్మరణీయం



కందనూరు బాపూజీకి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

నాయుడుపేట, ఫిబ్రవరి 21: ఉపాధ్యాయుడుగా, సామాజిక వేత్తగా కందనూరు బాపూజీ అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రముఖులు అన్నారు. నాయుడుపేటలోని నాయుడుహాల్‌లో బుధవారం జరిగిన కందనూరు బాపూజీ ఉత్తర క్రియల్లో పలువురు నివాళులర్పించారు. బాపూజీ ఉపాధ్యాయుడుగా విద్యార్థులకు ఉత్తమ నడవడిక, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం అలవర్చారన్నారు. అలాగే ఆయన పలు సామాజిక సేవల్లో ఆధ్యాత్మిక సేవల్లో కీలకపాత్ర వహించేవారన్నారు. స్థానికంగా స్వర్గధామం ఏర్పాటుకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దనరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచు గాలి రమేష్‌నాయుడు, చదలవాడ కుమార్, గాదిరెడ్డి గోపి, నారాయణరెడ్డి, చింతల సతీష్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన

నాయుడుపేట, ఫిబ్రవరి 21: పట్టణంలోని లోతువానిగుంట, చంద్రబాబు నాయుడు కాలనీ, మండలంలోని విన్నమాల గ్రామాల్లో హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన కల్పించారు. సురక్షితం కాని రక్త మార్పిడి, కలుషితమైన సిరంజీలు, అభ్యంతరకరమైన లైంగిక ప్రక్రియ ద్వారా హెచ్‌ఐవీ సోకే అవకాశం ఉందన్నారు. నవజీవన్ సంస్థ మేనేజర్ బాలాజీ, శ్రావణి, సుప్రజ, పావని, మేరీ, ప్రసన్న, లావణ్య, హరిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21: సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో ఫ్లైఓవర్ వద్ద రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.... ఓ మహిళ ఫ్లైఓవర్ కింద రైల్వేట్రాక్ దాటుతుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్లే జీటీ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు ఎరుపు రంగుచీర, బ్లూ రంగు రవిక ధరించి ఉంది. సుమారు 40 సంవత్సరాలు వయస్సు ఉంటుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి


నాయుడుపేట టౌన్ ఫిబ్రవరి 21: నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ కొండప్పనాయుడు తెలిపారు. మృతుడి వయస్సు 60నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రైల్వే ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిల్లకూరు, ఫిబ్రవరి 21: మండలంలోని బూదనం టోల్ ప్లాజా సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... తిరుపతికి చెందిన నాగరాజు, త్యాగరాజు కారులో తిరుపతి వైపు వెళుతుండగా బూదనం టోల్‌ప్లాజా సమీపంలో అదుపుతప్పి ముందు వెళుతున్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నాగరాజు, త్యాగరాజుకు గాయాలవడంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాగ్రత్త పడకుంటే కష్టాలే!

- ప్రాజెక్టుల్లో దిగజారుతున్న నిల్వలు
- ఇంకా నెలన్నరపాటు నీరివ్వాల్సిన పరిస్థితి
- కేటాయింపులకు మించి సాగవుతున్న పంటలు
- తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం



అడుగంటుతున్న సోమశిల జలాశయం

నెల్లూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటల సాగు కీలక దశకు చేరుకుంది. కొన్నిచోట్ల వచ్చే నెలలో వరి కోతలు ప్రారంభం కానుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఏప్రిల్‌లో కోతలు జరగనున్నాయి. ఈ ఏడాది నీటి లభ్యత తక్కువగా ఉన్న కారణంగా సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. మిచౌంగ్ తుపాన్ దెబ్బకు రైతులు తీవ్రంగా నష్టపోయి రెండోసారి నార్లు పోసుకున్నారు. ఈ పరిస్థితుల్లో కనుపూరు కెనాల్ మినహాయించి పెన్నా డెల్టాలో మార్చి 15వ తేదీ వరకు కనుపూరు, కావలి, ఉత్తర, దక్షిణ కాలువ కింద ఏప్రిల్ మొదటి వారం వరకు సాగునీరు విడుదల చేయాల్సి ఉంటుందని వ్యవసాయ, ఇరిగేషన్ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. సాగునీటి సలహా మండలి (ఐఏబీ)లో 2 లక్షల ఎకరాలకు నీటి కేటాయింపులు ఇచ్చేలా నిర్ణయం తీసుకోగా, ఆ తర్వాత లెక్కలు మారిపోయాయి. 3లక్షల ఎకరాల వరకు సాగు జరుగుతున్నట్లు అంచనా. దీంతో గతంలోలా కాకుండా ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటికే సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో నీటినిల్వలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. కండలేరు కింద గూడూరు, వెంకటగిరి ప్రాంతాల్లో అనధికారికంగా చెరువుల్లో ఉన్న నీటితో పంటలు వేసేశారు. ఇప్పుడు ఆ పంటలను కాపాడుకునేందుకు నీరు ఇవ్వాలని అధికారులపై రైతులు ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు సోమశిల కింద కావలి, దక్షిణ కాలువల చివరి ఆయకట్టుకు నీరందడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. బుధవారం సోమశిలలో 19.379 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రోజుకు 3500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. ఆవిరి నష్టాలతో కలుపుకొని మూడు రోజులకు ఒక టీఎంసీ ఖర్చవుతోంది. మరో రెండు వారాలు ఇదే మొత్తాన్ని విడుదల చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత డెల్టా ప్రాంతానికి కొంత తగ్గించవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ లెక్కన చూసుకున్నా ఏప్రిల్ మొదటి వారం వరకు మరో పది టీఎంసీలలోపు మాత్రమే ఖర్చు చేయగలిగితేనే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. అప్పుడు 7.50 టీఎంసీలు డెడ్ స్టోరేజీ పోను మరో రెండు టీఎంసీలు తాగునీటి అవసరాలకు సరిపోతాయి. అలా కాకుండా నీటి యాజమాన్యంలో నిర్లక్ష్యం వహిస్తే తాగునీటికి ఇబ్బందులు పడాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాగుకు పోను మిగిలిన నీటితోనే అక్టోబరు వరకు జిల్లా తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంటుంది.

చెన్నైకు అవసరం లేదు!

ఈ ఏడాది చెన్నై తాగునీటి అవసరాలకు ఇంత వరకు సోమశిల నుంచి నీటి విడుదల చేయలేదు. అదృష్టవశాత్తూ మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో చెన్నైలోని రిజర్వాయర్లన్నీ నిండిపోయాయి. వారికి ఇప్పట్లో నీటి అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు. కాబట్టి ఆ మిగులు నీరే ఇప్పుడు పంటలను కాపాడుతోందని అంటున్నారు. అదే సమయంలో కండలేరులో 10.70 టీఎంసీల నీరు ఉంది. డెడ్ స్టోరేజీ 8.40 టీఎంసీలు పోను నికరంగా 2.30 టీఎంసీలు మాత్రమే సాగు, తాగుకు నీరు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున దిగువకు విడుదల చేస్తున్నారు. కానీ గూడూరు, వెంకటగిరి ప్రాంతాల్లో పంటలను కాపాడేందుకు నీరు విడుదల చేయాలంటూ రైతుల నుంచి విన్నపాలు అందుతుండటంతో కచ్చితంగా నీటిని ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అప్పుడు గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి ప్రాంతాలకు తాగునీటిని డెడ్‌స్టోరేజీ నుంచి తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని భావిస్తున్నారు. ప్రతి బొట్టును జాగ్రత్తగా వినియోగించుకుంటేనే వర్షాకాలం వరకు ఇబ్బందులు లేకుండా నెట్టుకురాగలుగుతామని నిపుణులు సూచిస్తున్నారు. ఇక నుంచి ఉన్నతాధికారులు నిరంతరం నీటి యాజమాన్యాన్ని పర్యవేక్షించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

టీడీపీ విజయానికి కలసికట్టుగా కృషి చేద్దాం: పాశం



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 21: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరం కలసికట్టుగా పని చేద్దామని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం కోట మండలం కేశవరం పంచాయతీకి చెందిన పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తున్న మీడియా ప్రతినిధుల మీద, పత్రికా కార్యాలయాలపై వైసీపీ నాయకులు దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. అరాచక పాలనను చూసి తట్టుకోలేక వైసీపీ నుంచి పలువురు టీడీపీలోకి చేరుతున్నారన్నారు. రాష్ట్రానికి అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, సర్వోత్తమరెడ్డి, వేణు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, ప్రవీణ్‌రెడ్డి, సురేంద్ర, సుధీర్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని రెడ్డిగుంట, తిరుపతిగారిపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దుద్దా రాఘవరెడ్డి, మట్టం శ్రావణి, అమరేంద్ర, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, సుధాకర్ నాయుడు, విజయ్‌భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

చిట్టమూరు, కొత్తగుంట గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

చిట్టమూరు, ఫిబ్రవరి 21: మండల కేంద్రమైన చిట్టమూరు, కొత్తగుంట గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో వైసీపీ బుధవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పలమర్తి గ్రామానికి చెందిన దూదేకుల సంఘం అధ్యక్షుడు, వైసీపీ మైనార్టీ సెల్ నాయకులు షేక్ హుస్సేన్ టీడీపీ చేరారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసిందని, ఉపాధి లేక యువత వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపాన నిషేధం అన్న జగన్ నాశిరకం మద్యం విక్రయిస్తూ పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. అవినీతి, దోపిడీలు, దౌర్జన్యాలకు ఆజ్యం పోసిన వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, కస్తూరయ్య, కాపులూరు చెంచురామయ్య, రషీద్, కల్లూరు మణి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో మిస్ ఇండియా భావన



దంత పరికరాన్ని ప్రారంభిస్తున్న భావన

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని సుమన్ ప్రజా దంత వైద్యశాలలో త్రీడీ డిజిటల్ ఇంట్రా ఓరల్ కేంద్రాన్ని '2023 మిస్ ఇండియా ఐ కానిక్ దివా' భావన చినతంబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పట్టణమైన వెంకటగిరిలో డాక్టర్ సుమన్ కార్పొరేట్‌కు ధీటుగా ఆధునిక దంత యంత్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, శ్రీకాళహస్తి కమిషనర్ రమేష్ బాబు, డాక్టర్ సంజీవరాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

డక్కిలి, ఫిబ్రవరి 21: మండలంలోని మోపూరు గ్రామంలో బుధవారం రాపూరు కరుణామయి ఆస్పత్రి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ గ్రామాల నుంచి సుమారు 300 మంది రోగులు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. వీరందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక అంగన్‌వాడీ పాఠశాల విద్యార్థులకు ట్రస్టు డైరెక్టర్ విజయ్ గోకుల్ పేస్టు, బ్రష్‌లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి శేషయ్య, వైద్యులు రాజేష్, సాయికృష్ణ, షారుక్, రాహుల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొరిడి - పేర్నాడు రోడ్డు పరిశీలన

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21: తీరప్రాంత గ్రామాలకు వెళ్లే కొరిడి - పేర్నాడు రోడ్డును బుధవారం తహసీల్దార్ గోపాలకృష్ణ పరిశీలించారు. తారు రోడ్డేస్తేనే ఓటేస్తామంటూ కొరిడి, కడపత్ర, దామరాయి పంచాయతీల గ్రామాల ప్రజలు ఉధ్యమం ప్రారంభించారు. దీంతో ఆర్డీవో చంద్రముని ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడి నివేదికలు ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ గోపాలకృష్ణ సిబ్బందితో వెళ్లి రోడ్డును పరిశీలించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ

కోట, ఫిబ్రవరి 21: కోటలోని ఏవీకేఆర్ ఉన్నత పాఠశాలలో బుధవారం గూడూరు నియోజకవర్గ స్థాయి ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపధ్యాయులకు శిక్షణ తరగతులు జరిగాయి. క్రీడల పట్ల తీసుకోవాల్సిన చర్యలు, గ్రామీణస్థాయిలో క్రీడాకారుల ఎంపిక విధానం, తదితర అంశాలపై వ్యాయామ ఉపాధ్యాయులకు కోర్సు డైరెక్టర్లు శివకుమార్, సురేంద్రబాబు శిక్షణ ఇచ్చారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోట, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని కర్లపూడి వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగబాబు బుధవారం తెలిపారు.

ఏఈకి పదోన్నతి

కోట, ఫిబ్రవరి 21: కోటలోనిసబ్‌స్టేషన్‌లో ఏఈగా పనిచేస్తున్న మునీంద్రకు ఏడీఈగా పదోన్నతి లభించింది. ఆయనను తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ఏడీఈ నియమించినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలపై సమీక్ష

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 21: వెంకటగిరి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల గురించి తహసీల్దార్లు, రాజకీయ నాయకులతో స్థానిక తహసీల్దారు సాంబశివరావు సమీక్ష నిర్వహించారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, ఫాం 6, 7, 8 గురించి వివరించారు. అదేవిధంగా ఆన్‌లైన్ డేటా, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, లోకేషన్ మార్పు పరిశీలించాలన్నారు. బూత్‌లో ఓటర్ల సంఖ్య 1500 దాటితే అనుబంధంగా వేరే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నెల్లూరు జిల్లా పరిధిలోని రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో 6 పోలింగ్ కేంద్రాలు పేర్లు తప్పుగా ఉన్నాయని రాజకీయ నాయకులు చెప్పడంతో వాటిని వెంటనే సరిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, డీటీ యువరాజు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో జాతీయ సదస్సు

కోట, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 15వ తేదీన టెక్ వ్యూహ 2024 జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ నారాయణరావు, లిఖిత్, గ్రీష్మ, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని ఆబాక గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, కోట పోలూరులో రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును బుధవారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, సర్పంచు శారద, ఎంపీటీసీ పద్మ, జెట్టి వేణుయాదవ్, మెళ్లకంట వీరస్వామి, మోహన్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, కృపాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

కోట, ఫిబ్రవరి 21: గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కోటలోని అల్లారెడ్డి వెంకటకృష్ణారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో నగదు పురస్కారాలు బుధవారం అందజేశారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంలో అత్యధిక మార్కులు సాధించి నవిద్యార్థులు శ్రీకర్, ఏడుకొండలుకు ఒక్కొక్కరికి రూ.10వేలు నగదును ఎంఈవో దారా మస్తానయ్య చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మంచి మార్కులతో మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థిని, విద్యార్థులను షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలతో అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు నాగయ్య, గిరిధర్, విజయభాస్కర్, విశ్రాంత హెచ్ఎం సుబ్రహ్మణ్యం, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి షీల్డ్ అందజేస్తున్న ఎంఈవో

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 21: చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక కృష్ణమందిరం ప్రాంతంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ నిత్యావసర వస్తువుల ధరలు, ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు, పన్నులు పెంచివేయడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు పరుస్తారన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, శివకుమార్, శివప్రసాద్, నరసింహులు నాయుడు, నరసింహులు, భారతి, జనార్దన రెడ్డి, సునీల్, సందీప్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

వెంకటగిరి, ఫిబ్రవరి 21: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని ఆశాఖ విజిలెన్స్ అధికారి శ్రీనివాస బాబు హెచ్చరించారు. బుధవారం పట్టణ పరిధిలోని పలుప్రాంతాల్లో విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని బొప్పాపురం, పెరియవరం, కాంపాళెం, కుమ్మరిగుంట ప్రాంతాల్లోని విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసి రూ.25 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. అదేవిధంగా అధిక లోడ్ వినియోగిస్తుతన్న 9మందికి రూ.1,10 లక్షల జరిమానా విధించినట్లు వివరించారు. అనంతరం పాలకేంద్రం వద్ద ఉన్న సబ్ డివిజన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో విద్యుత్ పొదుపుపై మేల్కొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు మాధవరావు, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకే రెడ్‌బుక్ డే

గూడూరు, ఫిబ్రవరి 21: కార్మికుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు రెడ్‌బుక్ డేగా జరుపుకుంటున్నామని సీపీఎం నాయకుడు బీవీ రమణయ్య అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రెడ్‌బుక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళిని విముక్తి బాట పట్టించేందుకు లెనిన్, కార్ల్‌మార్క్స్ రచించిన విప్లవ పుస్తకాలను 1848 ఫిబ్రవరి 21న ప్రజలకు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సురేష్, వెంకట్రామిరెడ్డి, జోగి శివకుమార్, సుధీర్, వాసుదేవరావు, ప్రసాద్, చంద్రయ్య, రమేష్, భాస్కర్‌రెడ్డి, చిన్నా, మణి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష ఎంతో విశిష్టమైనది



మాతృభాషా దినోత్సవంలో ప్రిన్సిపాల్ రూత్ రమోలా, ఉపాధ్యాయులు

నాయుడుపేట, ఫిబ్రవరి 21: మాతృభాష ఎంతో విశిష్టమైనదని గురుకుల ప్రిన్సిపాల్ రూత్ రమోలా అన్నారు. నాయుడుపేట మండలం పుదూరులోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం మాతృబాషా దినోత్సవం నిర్వహించారు. మన భావ వ్యక్తీకరణకు మనోభావాలకు మాతృభాషలోనే పూర్తిస్థాయిలో వ్యక్త పరచగలమని ప్రిన్సిపాల్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, సునీత, భూలక్ష్మి, వరలక్ష్మి, పద్మజ పాల్గొన్నారు.

వలంటీర్లు అంకితభావంతో పనిచేయాలి

గూడూరు, ఫిబ్రవరి 21: వలంటీర్లు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు అన్నారు. బుధవారం పలువురు వలంటీర్లకు సన్మానించి ప్రశంసపత్రాలను అందజేశారు. పొణకా దేవేనమ్మ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, నాశిన నాగులు, బొమిడి శ్రీనివాసులు, తాళ్లూరు శ్రీనివాసులు, రాజేష్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.